# విశాల భారతి

07-04-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 93


## యుద్ధం ఆగుతుందా?



- అమెరికా-ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్, ఈజిప్టు
- 45 రోజుల కాల్పుల విరమణ కోసం కొత్త ప్రతిపాదన సిద్ధం
- తాత్కాలిక ఒప్పందం కోసం హర్మూజ్ జలసంధిని తెరవమని స్పష్టం
- శాశ్వత శాంతికి హామీ లేని ప్రయత్నాలపై జాగ్రత్తగా ఉంటామని వెల్లడి
- అమెరికా దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మాజిద్ ఖాదేమీ మృతి
- శాంతి ఒప్పందంపై ఇరు దేశాల అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు

02

# 9 మంది పోలీసులకు ఉరిశిక్ష!






2020 లాక్‌డౌన్‌లో జయరాజ్, బెన్నిక్స్‌లపై దారుణ హింస





- పోలీసుల విచక్షణా రహిత దాడిలో తండ్రీకొడుకులు మృతి
- మహిళా కానిస్టేబుల్ సాక్ష్యంతో బయటపడ్డ అరాచకం
- సాక్ష్యాలు చెరిపేసినా పక్కా ఆధారాలతో పట్టుకున్న సీబీఐ
- దేశ చరిత్రలోనే అత్యంత అరుదైన, కఠినమైన తీర్పు

**విశాలభారతి, జాతీయం:**

తమిళనాడు రాష్ట్రంలోని తూత్తుకుడి జిల్లా సత్తాంకుళం పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్నేళ్ల క్రితం చోటుచేసుకున్న తండ్రీకొడుకుల లాకప్ మరణాల ఉదంతం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. చట్టాన్ని రక్షించాల్సిన వారే కాలయములై సామాన్యుల ప్రాణాలు తీసిన ఈ అమానవీయ ఘటనపై మదురై జిల్లా కోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. పోలీసు వ్యవస్థలోని కొందరు అధికారుల పైశాచికత్వానికి పరాకాష్టగా నిలిచిన ఈ కేసులో ఏకంగా తొమ్మిది మంది పోలీసులకు ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకోవడం భారత న్యాయ చరిత్రలోనే అత్యంత అరుదైన ఘట్టంగా నిలిచిపోనుంది. నిందితులు తమకు ఉన్న అధికార గర్వంతో సామాన్య పౌరుల పట్ల ప్రదర్శించిన క్రూరత్వం క్షమించరాని నేరమని ధర్మాసనం అభిప్రాయపడింది. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న 2020 జూన్ నెలలో లాక్‌డౌన్ నిబంధనల అమలు పేరుతో జరిగిన ఈ దారుణం మానవత్వాన్ని సిగ్గుపడేలా చేసింది. సత్తాంకుళంలో మొబైల్ షాపు నడుపుతున్న జయరాజ్, ఆయన కుమారుడు బెన్నిక్స్ నిర్ణీత సమయం కంటే అదనంగా దుకాణం తెరిచి ఉంచారనే చిన్న సాకుతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేవలం మాటా మాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన ఖాకీలు వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆ రాత్రంతా అనాగరికంగా చిత్రహింసలకు గురిచేశారు. తండ్రీకొడుకులని కూడా చూడకుండా వారిపై లాఠీలతో విచక్షణారహితంగా దాడి చేస్తూ తమ పైశాచిక ఆనందాన్ని తీర్చుకున్నారు. పోలీసుల దెబ్బలకు తాళలేక తండ్రీకొడుకులు విలవిలలాడుతున్నా కనికరం లేకుండా దాడులు కొనసాగించారని విచారణలో తేలింది. గాయాలపాలైన బెన్నిక్స్ జూన్ 22న మరణించగా, మరుసటి రోజే తండ్రి జయరాజ్ కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ జంట మరణాలు తమిళనాడులో పెద్ద ఎత్తున నిరసనలకు దారి తీశాయి. సామాన్యుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన రక్షక భట నిలయాలు మృత్యు కుహరాలుగా

మిగతా 2లో..



## గుత్తి కోయల నీటి గోస

- దశాబ్దాలు గడుస్తున్నా గిరిజన గ్రామాల్లో మారని తాగునీటి కష్టాలు
- ములుగు జిల్లా శాంతినగర్ గూడెంలో చుక్క నీరు దొరకని దుస్థితి
- తాగునీటి కోసం స్వయంగా బావి తవ్వుతున్న గుత్తి కోయ గిరిజనులు
- ప్రాణాలకు తెగించి 30 అడుగుల లోతు తవ్వినా పడని నీరు
- ప్రభుత్వ నిధులు ఖర్చు అవుతున్నా గిరిజన గూడెంలకు అందని ఫలాలు
- శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు గిరిజనుల విన్నపం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

స్వతంత్ర భారతాన దశాబ్దాల కాలం గడిచినా, ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు మారుతున్నా అట్టడుగున ఉన్న గిరిజన పల్లెల్లో వెలుగులు నిండటం లేదు. అభివృద్ధి అంటే కేవలం కాగితాలకే పరిమితమవుతోందనే విమర్శలకు ములుగు జిల్లా మంగపేట మండలంలోని శాంతినగర్ గూడెం ఒక నిలువుటద్దంగా కనిపిస్తోంది. పాలకుల ప్రకటనల్లో కనిపించే తాయిలాలు, కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయింపులు ఈ అడవి బిడ్డల వాకిలి వరకు చేరకపోవడం దురదృష్టకరం.

మిగతా 3లో..

## కొహెడ మార్కెట్ అమ్మకానికి రేవంత్ కుట్ర

- రూ.3,000 కోట్ల కొహెడ మార్కెట్ భూమి విక్రయానికి కుట్ర
- కేరళ దళారులతో లీలా హోటల్‌లో రహస్య చర్చలు
- మార్కెట్‌కు బదులుగా కోర్టు కేసుల్లో ఉన్న భూమి కేటాయింపు
- నిధులున్నా మార్కెట్ నిర్మాణ పనుల్లో ప్రభుత్వం జాప్యం
- 25 వేల మంది రైతుల ప్రయోజనాలకు విఘాతం
- పనులు మొదలుపెట్టకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగర శివారులోని కొహెడ పండ్ల మార్కెట్ స్థల వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో రైతుల ప్రయోజనాల కోసం కేటాయించిన ఈ విలువైన భూమిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఈ వ్యవహారంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సన్నిహితులకు, దళారులకు మేలు చేయడమే లక్ష్యంగా సుమారు మూడు వేల కోట్ల రూపాయల విలువైన 200 ఎకరాల

మిగతా 3లో..

## 2034 వరకు మనదే రాజ్యం..!



- మళ్లీ ఎవరూ గడీల పాలన, గత పాలకులను కోరుకోరు
- పదేళ్లు అధికారంలో ఉండి చేయని వారు విమర్శిస్తున్నారు
- అభివృద్ధికి అడ్డుపడకుండా ప్రతిపక్షాలు ఓపిక పట్టాలి
- ప్రజా ప్రభుత్వం 2034 వరకు అధికారంలోనే ఉంటుంది.
- ఆదిలాబాద్‌ను విద్యా, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- మాయగాళ్లు మారీచుల రూపంలో వస్తున్నారు, ప్రజలు జాగ్రత్త

03



## పొత్తుల్లేవు.. ఒంటరి పోరే!

- రాబోయే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు ఉండదు,
- గ్రేటర్ ఎన్నికల్లో 3 మేయర్ స్థానాలే లక్ష్యంగా బరిలోకి
- హైడ్రా కూల్చివేతలు, ఆరు గ్యారెంటీలపై రేవంత్ వైఫల్యం
- ఎన్నికల కోసం రాహుల్ గాంధీకి రేవంత్ రూ.1000 కోట్లు

04



## తుపాకీ విడిచిన బలగం

- మావోయిస్ట్ కమాండర్ మల్లా సహా 40 మంది సరెండర్
- వీరి నుండి ఏకే-47 సహా భారీగా ఆయుధాల స్వాధీనం
- లొంగిన వారిలో మంగ్తు, మహేంద్ర వంటి టాప్ లీడర్లు
- ధర్మారం క్యాంపు దాడిలో కేశాలు ప్రధాన నిందితుడు
- కేంద్రం చర్యలతో మావోయిస్టులకు గట్టి దెబ్బ
- 2026 మార్చి నాటికి నక్సలిజం పూర్తి నిర్మూలనే ధ్యేయం

02

## రాముడి భూములను తెలంగాణకు తెస్తారా?

- ఏపీలో కలిపిన 5 పంచాయతీలను తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్
- ఆలయానికి చెందిన 889 ఎకరాల భూమి ఏపీలో ఉండటంపై రచ్చ
- చిన్న పనికైనా 280 కి.మీ. దూరంలోని పాడేరు వెళ్లలేక అవస్థలు
- అమరావతిపై చూపిన వేగం.. తెలంగాణ విజ్ఞప్తిపై లేదని విమర్శ
- చట్ట సవరణ చేసి గ్రామాలను అప్పగించాలని సీఎం డిమాండ్
- బండి సంజయ్ చొరవ చూపాలని కాంగ్రెస్ నేతల ఒత్తిడి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే అన్న చందంగా ఆంధ్రప్రదేశ్ అవసరాలను తీర్చడంలో ఎక్కడలేని ఆసక్తి కనబరిచే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విషయంలో మాత్రం నాన్చివేత ధోరణి అవలంబిస్తోంది. అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసిన కొద్ది రోజుల్లోనే పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించిన కేంద్రం, తెలంగాణకు చెందిన ఐదు గ్రామ పంచాయతీల విషయంలో ఏళ్ల తరబడి కాలయాపన చేస్తోంది. పన్నెండేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన భద్రాచలం మండలానికి చెందిన ఏటపాక, కన్నాయిగూడెం, పురుషోత్తమపట్నం, పిచ్చుకలపాడు, గుండాల గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణకు అప్పగించాలన్న విజ్ఞప్తిని బుట్టదాఖలు చేస్తోంది. ఈ అంశం ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదంగానే కాకుండా రాజకీయంగా పెద్ద దుమారానికి దారితీస్తోంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం 2014లో కొలువుదీరిన వారాల వ్యవధిలోనే ఐదు గ్రామ పంచాయతీలను, 19 రెవెన్యూ గ్రామాలను ఏపీలో విలీనం చేస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టానికి సవరణలు చేసింది. తెలంగాణ రాష్ట్రం లాంఛనంగా ఆవిర్భవించక ముందే ఏడు మండలాలు ఏపీలో కలిసిపోగా, ఆ తర్వాత

మిగతా 2లో..



## త్వరలోనే తులం బంగారం

- త్వరలోనే తులం బంగారం హామీని అమలు చేస్తాం
- ఐదేళ్లలో వంద శాతం హామీలను నెరవేరుస్తాం
- ఇప్పటికే రైతు రుణమాఫీ, ఉచిత బస్సు అమలు చేశాం
- సీఎం, మంత్రుల మధ్య ఎలాంటి విభేదాలు లేవు

03

# యుద్ధం ఆగుతుందా?

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని చల్లబరిచేందుకు అంతర్జాతీయ స్థాయిలో ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. గత కొంతకాలంగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కొనసాగుతున్న ఘర్షణలకు ముగింపు పలికే దిశగా దౌత్యపరమైన చర్చలు ఊపందుకున్నాయి. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో పాకిస్థాన్, తుర్కియే, ఈజిప్టు దేశాలు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ శాంతి స్థాపనకు నడుం బిగించాయి. ఇరు పక్షాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఒక ప్రత్యేక ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేసి అగ్రరాజ్యం అమెరికాతో పాటు ఇరాన్ పాలకులకు అందజేశాయి. ఈ ప్రతిపాదనల ద్వారా ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉప్పు నిప్పు పరిస్థితులను చక్కదిద్ది, ప్రాంతీయ స్థిరత్వాన్ని కాపాడాలన్నదే మధ్యవర్తిత్వ దేశాల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. యుద్ధం వల్ల కలిగే ఆర్థిక, సామాజిక నష్టాలను నివారించేందుకు ఈ మూడు దేశాలు తమ వంతు కృషిని వేగవంతం చేశాయి. మధ్యవర్తులు సిద్ధం చేసిన ఈ కీలక ముసాయిదాలో ప్రధానంగా 45 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణను ప్రతిపాదించారు. ఈ నిర్ణీత గడువులోగా ఇరు దేశాలు పరస్పరం దాడులను నిలిపివేసి, శాశ్వత శాంతి దిశగా విస్తృత స్థాయి చర్చలు జరిపేందుకు అవకాశం లభిస్తుందని అంతర్జాతీయ దౌత్యవేత్తలు భావిస్తున్నారు. అదేవిధంగా అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంపై కూడా ఈ ప్రణాళికలో స్పష్టమైన ప్రతిపాదనలు చేర్చారు. ఈ జలసంధి మూసివేత వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు ఆటంకం ఏర్పడి ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడం ద్వారా అటు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతో పాటు ఇటు యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించవచ్చని మధ్యవర్తిత్వ దేశాలు యోచిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ముసాయిదా ప్రతిపాదనలను అమెరికా, ఇరాన్ అగ్రనేతలు తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. అయితే కాల్పుల విరమణ ఒప్పందంపై ఇరాన్ వైఖరి మాత్రం ఆశాజనకంగా కనిపించడం లేదు. తాత్కాలిక కాల్పుల విరమణ కోసం తమ వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని ఆ దేశ ఉన్నతాధికారి ఒకరు కుండబద్దలు కొట్టారు. శాశ్వత శాంతికి హామీ లేని పక్షంలో తమ నిర్ణయాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. గతంలో ఇలాంటి తాత్కాలిక ఒప్పందాల వల్ల తమకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని, అందుకే ఈసారి అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని ఆ దేశం చెబుతోంది. హర్మూజ్ జలసంధి అనేది ఇరాన్ చేతిలో ఉన్న ఒక ప్రధాన ఆయుధంలాంటిదని, దానిని అంత సులభంగా వదులుకోవడానికి ఇష్టపడటం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అగ్రరాజ్యం అమెరికా నుంచి స్పష్టమైన హామీలు లభిస్తే తప్ప ఇరాన్ వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. భారత్‌లో ఇరాన్ రాయబారి డాక్టర్ మహమ్మద్ ఫతాలీ సైతం ఈ పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. శాశ్వత శాంతికి మార్గం సుగమం కాని ఏ ప్రయత్నమైనా వృధా అని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో జరిగిన చర్చలు, కాల్పుల విరమణ ఒప్పందాల విషయంలో తమ దేశానికి చేదు అనుభవాలే ఎదురయ్యాయని ఆయన గుర్తు చేశారు. అందుకే ప్రస్తుతం మధ్యవర్తులు తెచ్చిన ముసాయిదా ప్లాన్ పట్ల తమ దేశం ఆచితూచి అడుగులు వేస్తోందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలంటే అగ్రరాజ్యాల వైఖరిలో మార్పు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఇరాన్ ప్రయోజనాలకు భంగం కలగకుండా ఉండే పరిష్కార మార్గాల కోసమే తాము ఎదురుచూస్తున్నామని ఆయన వివరించారు. ఈ వ్యాఖ్యలను బట్టి ఇరాన్ ఇప్పట్లో మెత్తబడే సూచనలు కనిపించడం లేదు. శాంతి ప్రయత్నాలు ఒకవైపు సాగుతుండగానే, మరోవైపు యుద్ధం మరింత ఉగ్రరూపం దాల్చుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన మెరుపు దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్‌కు చెందిన అత్యంత కీలక అధికారి ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ మాజిద్ ఖాదేమీ మరణించినట్లు ఆ దేశ అధికారిక మీడియా ధ్రువీకరించింది. ఈ రోజు తెల్లవారుజామున జరిగిన దాడిలో ఆయన మృతి చెందడం ఇరాన్ సైన్యానికి కోలుకోలేని దెబ్బగా పరిగణిస్తున్నారు. ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఖాదేమీని లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం ఇరు దేశాల మధ్య శతృత్వాన్ని మరింత పెంచింది. తమ అగ్రశ్రేణి నాయకుడి మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియాలో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇంటెలిజెన్స్ చీఫ్ మరణం తర్వాత ఇరాన్ తన సైనిక కార్యకలాపాలను ముమ్మరం చేసే అవకాశం ఉంది. ఇప్పటికే ఆ దేశం తన క్షిపణి వ్యవస్థలను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తోంది. మరోవైపు అమెరికా సైతం ఈ ప్రాంతంలో తన నౌకాదళాన్ని మరింత బలోపేతం చేస్తూ ఇరాన్‌కు సవాల్ విసురుతోంది. యుద్ధ క్షేత్రంలో జరుగుతున్న ఈ మార్పులు శాంతి చర్చలపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. ఒకవైపు చర్చల ముసాయిదా, మరోవైపు రక్తపాతం పశ్చిమాసియాను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. దౌత్య మార్గాల ద్వారా సమస్య పరిష్కారం కాకపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హర్మూజ్ జలసంధి మూసివేత వల్ల చమురు ఎగుమతులు నిలిచిపోయి భారత్ వంటి దేశాలపై భారం పడుతోంది. ప్రపంచ దేశాలన్నీ ఈ సంక్షోభం త్వరగా ముగియాలని కోరుకుంటున్నాయి. రష్యా, చైనా వంటి దేశాలు సైతం ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తుండటంతో ఈ యుద్ధం మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి సైతం ఇరు దేశాలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రతి రోజూ సరిహద్దుల్లో కాల్పులు, డ్రోన్ దాడులు నిరంతరాయంగా సాగుతున్నాయి. మృతుల సంఖ్య పెరుగుతుండటంతో మానవతా సంక్షోభం తలెత్తే అవకాశం కనిపిస్తోంది. మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్, తుర్కియే, ఈజిప్టు దేశాల నేతలు నిరంతరం ఇరు పక్షాల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నారు. కాల్పుల విరమణకు ఇరాన్ అంగీకరిస్తేనే చర్చలు ముందుకు సాగుతాయని అమెరికా స్పష్టం చేస్తోంది. అమెరికా ఆంక్షల నుంచి తమకు విముక్తి కల్పిస్తేనే తాము వెనక్కి తగ్గుతామని ఇరాన్ కండిషన్ పెడుతోంది. ఈ పంతాల మధ్య సామాన్య ప్రజలు బలైపోతున్నారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల సామాన్యుడి జీవనం భారంగా మారుతోంది. యుద్ధం కేవలం రెండు దేశాల మధ్యే కాకుండా ప్రపంచంపై తన ప్రభావాన్ని చూపుతోంది. అగ్రరాజ్యాల ఆధిపత్య పోరులో మధ్య ప్రాచ్య దేశాలు నలిగిపోతున్నాయి. ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి తర్వాత ఆ దేశం తన వ్యూహాన్ని మార్చుకోబోతోంది. అమెరికా రహస్య స్థావరాలపై దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ సైతం తన రక్షణ వ్యవస్థను పటిష్టం చేసుకుని ఇరాన్ దాడులను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉంది. ఈ పరిణామాలు కేవలం సైనిక ఘర్షణలకే పరిమితం కాకుండా సైబర్ దాడులకు కూడా దారితీస్తున్నాయి. ఇరు దేశాలు ఒకరి సాంకేతిక వ్యవస్థలపై మరొకరు దాడులు చేసుకుంటున్నాయి. ఈ గందరగోళ పరిస్థితుల్లో శాంతి చర్చలు ఫలవంతం కావడం కష్టమని తెలుస్తోంది. మధ్యవర్తులు ఇచ్చిన 45 రోజుల ప్లాన్ పై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతానికి అమెరికా, ఇరాన్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ముసాయిదాలోని అంశాలపై ఇరు దేశాల రక్షణ శాఖలు లోతుగా అధ్యయనం చేస్తున్నాయి. తన ప్రయోజనాలకు భంగం కలగకుండా ఒప్పందం ఉండాలని ఇరాన్ కోరుకుంటుండగా, అగ్రరాజ్యం తన పట్టు సడలించుకోవడానికి ఇష్టపడటం లేదు. ఈ చర్చలు విఫలమైతే యుద్ధం తీవ్ర రూపం దాల్చడం ఖాయం. అప్పుడు హర్మూజ్ జలసంధి శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉంది. దానివల్ల కలిగే పర్యవసానాలను ఎదుర్కోవడం ప్రపంచ దేశాలకు సవాల్‌గా మారనుంది. దౌత్యపరమైన ఒత్తిడి పెంచి యుద్ధాన్ని ఆపడమే ఇప్పుడున్న ఏకైక మార్గం.



# తుపాకీ విడిచిన బలగం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్టు ఉద్యమానికి భారీ విఘాతం కలిగింది. దశాబ్దాలుగా అడవిని నమ్ముకుని, సాయుధ పోరాటమే మార్గమని భావించిన కీలక నేతలు ఇప్పుడు తుపాకులు వదిలి జనజీవన స్రవంతిలో కలిశారు. పీఎల్‌జీఏ డిప్యూటీ కమాండర్ సోది కేశాలు అలియాస్ మల్లా నేతృత్వంలో సుమారు 40 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. హింస ద్వారా మార్పు సాధ్యం కాదని గ్రహించిన వీరంతా శాంతి మార్గాన్ని ఎంచుకున్నారు. వీరి నుంచి ఏకే 47 వంటి శక్తివంతమైన ఆయుధాలతోపాటు భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామం మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బగా భద్రతా దళాలు భావిస్తున్నాయి. లొంగిపోయిన వారిలో అగ్రశ్రేణి నాయకులు ఉండటం గమనార్హం. డివిజనల్ కమిటీ సభ్యుడు మంగ్తు, ఏరియా కమిటీ సభ్యుడు మహేంద్ర, ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడు మిడియం రింకూ వంటి వారు మల్లా వెంటే నడిచి పోలీసుల చెంతకు చేరారు. వీరితోపాటు ప్లాటూన్ సభ్యులు పొడియం చంద్రి, గోన్సె భీమ్, మడకం నరేశ్, పూణెమ్ ఐథే, సోది భీమ, మొడియం రీనా, సోది రంజిత్ కూడా ఆయుధాలు విడిచిపెట్టారు. దళ సభ్యులంతా సామూహికంగా ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక పార్టీలో పెరుగుతున్న అసంతృప్తి, పోలీసుల ఒత్తిడి ప్రధాన కారణాలని తెలుస్తోంది. దశాబ్దాలుగా సాగుతున్న పోరులో ప్రాణాలు కోల్పోవడం తప్ప సాధించేదేమీ లేదని వీరు స్పష్టం చేసినట్లు సమాచారం. సోది కేశాలు అలియాస్ సోది కేశ మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన పీజీఎల్ఏ డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో తన దళాన్ని సమర్థవంతంగా నడిపించిన చరిత్ర ఆయనకు ఉంది. బీఎన్‌పీసీ బెటాలియన్ కమిటీలో సభ్యుడిగా ఉంటూ వ్యూహరచనలో కీలక పాత్ర పోషించేవారు. 2024 జనవరిలో ధర్మారం పోలీస్ క్యాంపుపై జరిగిన దాడిలో మల్లా ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. భద్రతా దళాలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మల్లా లొంగుబాటు పోలీసులకు పెద్ద విజయంగా పరిగణించవచ్చు. గత ఏడాది నవంబర్‌లో అన్నారంలో జరిగిన ఎన్‌కౌంటర్ నుంచి మల్లా తృటిలో తప్పించుకున్నారు. ఆ సమయంలో పోలీసులు అతడి కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటి నుంచి నిరంతర వేట కొనసాగుతూనే ఉంది. పోలీసులు చుట్టుముడుతున్న క్రమంలో అడవుల్లో మనుగడ కష్టంగా మారడం, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడం వంటివి కూడా ఈ నిర్ణయానికి దారితీశాయి. ప్రాణభయంతో తలదాచుకోవడం కంటే ప్రభుత్వం కల్పిస్తున్న లొంగుబాటు ప్యాకేజీని వినియోగించుకోవడం ఉత్తమమని మల్లా భావించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటామని వారు పోలీసు అధికారులకు హామీ ఇచ్చారు.కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల అణిచివేతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, ఏపీ, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో నక్సలిజాన్ని తుడిచిపెట్టేందుకు 2024లో 'ఆపరేషన్ కగార్' అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ఆపరేషన్ కింద భారీ ఎత్తున బలగాలను మోహరించి మావోయిస్టుల స్థావరాలను ధ్వంసం చేస్తున్నారు. ప్రభుత్వ గట్టి చర్యల వల్ల మావోయిస్టులు తమ ఉనికిని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఈ ఆపరేషన్ ప్రభావం వల్లే ఇప్పుడు ఇంత పెద్ద సంఖ్యలో లొంగుబాటులు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ ఉక్కుపాదం ముందు సాయుధ దళాలు నిలవలేకపోతున్నాయి. దేశవ్యాప్తంగా 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ గడువు సమీపిస్తున్న తరుణంలో భద్రతా దళాలు తమ వేగాన్ని పెంచాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు గిరిజనులను చైతన్యపరుస్తున్నారు. అభివృద్ధి ఫలాలు మారుమూల గ్రామాలకూ అందుతుండటంతో ఉద్యమానికి ప్రజల మద్దతు తగ్గుతోంది. యువత ఆయుధాల వైపు మొగ్గు చూపకుండా విద్యా, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నారు. ఈ వ్యూహం విజయవంతం కావడంతోనే అడవి బాట పట్టిన వారు తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు.

లోకసభ వేదికగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా బస్తర్ ప్రాంతాన్ని త్వరలోనే మావోయిస్టు రహిత ప్రాంతంగా మారుస్తామని ప్రకటించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్ ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటగా ఉండేది. అయితే ఇప్పుడు అక్కడ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నిరంతర కూంబింగ్ కార్యకలాపాలు, అభివృద్ధి పనులు మావోయిస్టుల కదలికలను పరిమితం చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సాగుతున్న ఈ పోరాటం మంచి ఫలితాలను ఇస్తోంది. అమిత్ షా ప్రకటించినట్లుగానే బస్తర్ అడవుల్లో ఇప్పుడు తుపాకుల మోత తగ్గుతోంది. శాంతి స్థాపనే ధ్యేయంగా కేంద్రం వేస్తున్న అడుగులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. తెలంగాణ పోలీసుల వ్యూహాత్మక చర్యలు కూడా ఈ లొంగుబాటులో కీలక పాత్ర పోషించాయి. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తామని, వారిపై ఉన్న కేసుల విషయంలో చట్టబద్ధంగా సహకరిస్తామని పోలీసులు భరోసా కల్పించారు. దీంతో దళ సభ్యుల్లో నమ్మకం పెరిగింది. హింసను వీడి వచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఉన్నతాధికారులు పదేపదే ప్రకటించారు. లొంగిపోయిన 40 మంది మావోయిస్టుల కుటుంబాల్లో ఇప్పుడు ఆనందం వెల్లివిరుస్తోంది. తమ వారు ప్రాణాలతో తిరిగి రావడం వారికి పెద్ద ఊరటనిచ్చింది. పోలీసు శాఖ త్వరలోనే ఈ లొంగుబాటుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రజలు ఈ పరిణామాన్ని ఆహ్వానిస్తున్నారు. మావోయిస్టుల సంచారం వల్ల నిత్యం భయం నీడలో బతికే సామాన్యులకు ఇప్పుడు కొంత ప్రశాంతత లభించినట్లయింది. అభివృద్ధి పనులకు అడ్డంకులు తొలగిపోవడంతో రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు తమ గ్రామాలకూ వస్తాయని వారు ఆశగా ఎదురుచూస్తున్నారు. దళాల కదలికలు తగ్గితే పోలీసులు కూడా తనిఖీల పేరుతో ఇబ్బంది పెట్టరని స్థానికులు భావిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. శాంతియుత వాతావరణంలోనే తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని పెద్దలు అభిప్రాయపడుతున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో కూడా ఈ లొంగుబాటు పెద్ద చర్చకు దారితీసే ప్రమాదం ఉంది. అగ్రనేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడటం వల్ల క్యాడర్‌లో నైతిక స్థైర్యం దెబ్బతింటుంది. పార్టీ సిద్ధాంతాలకు కాలం చెల్లిందని, ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటం అసాధ్యమని కింది స్థాయి సభ్యులు భావించే అవకాశం ఉంది. మల్లా వంటి సమర్థవంతమైన నాయకుడు పోలీసుల దరి చేరడం వల్ల పార్టీకి సంబంధించిన కీలక రహస్యాలు బయటపడే వీలుంది. ఇది రాబోయే రోజుల్లో మరిన్ని లొంగుబాటులకు లేదా అరెస్టులకు పునాది వేయవచ్చు. మావోయిస్టు ఉద్యమం ఇప్పుడు మనుగడ కోసం తీవ్రంగా శ్రమిస్తోంది.



# 9 మంది పోలీసులకు ఉరిశిక్ష!

**మొదటిపేజీ తరువాయి**

మారడంపై ప్రజలు వీధుల్లోకి వచ్చి పోరాడారు. ఈ తీవ్రతను గమనించిన ప్రభుత్వం వెంటనే బాధ్యులను సస్పెండ్ చేసి కేసును సిబిఐ దర్యాప్తుకు అప్పగించింది. కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేంద్ర దర్యాప్తు సంస్థ లోతైన విచారణ జరిపి కోర్టుకు విస్తుపోయే నిజాలను సమర్పించింది. ఆ ఘోర రాత్రి పోలీస్ స్టేషన్‌లో జరిగిన అరాచకాన్ని ప్రత్యక్షంగా చూసిన ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన సాక్ష్యం ఈ కేసులో కీలకంగా మారింది. పోలీసు అధికారులు ఎంత క్రూరంగా ప్రవర్తించారో, బాధితులు ఎంతగా ఆర్తనాదాలు చేశారో ఆమె ధైర్యంగా న్యాయస్థానంలో వివరించారు. సాక్ష్యాధారాలను రూపుమాపేందుకు నిందితులు చేసిన ప్రయత్నాలను సైతం ఆమె బయటపెట్టడంతో నిందితుల పాపం పండింది. స్టేషన్ గోడలపై ఉన్న రక్తపు మరకలే ఆ రాత్రి జరిగిన హింసకు మౌన సాక్ష్యాలుగా నిలిచాయి. కోర్టులో జరిగిన వాదనల సమయంలో నిందితులు తమ రక్షణ కోసం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ శాస్త్రీయ ఆధారాల ముందు అవేవీ నిలబడలేదు. నిందితులైన ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు రఘు గణేష్, బాలకృష్ణన్‌లతో పాటు ఇతర కానిస్టేబుళ్లు పక్కా పథకం ప్రకారమే ఈ దారుణానికి ఒడిగట్టారని సిబిఐ వాదించింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని సామాన్యుల ప్రాణాలతో ఆడుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలి పెట్టు వంటిదని ప్రాసిక్యూషన్ బలంగా వినిపించింది. నేరం నిరూపితం కావడంతో న్యాయమూర్తి నిందితులకు కఠినమైన శిక్షలు విధిస్తూ తన తీర్పును వెలువరించారు. సాధారణంగా లాకప్ డెత్ కేసుల్లో పోలీసులకు శిక్షలు పడటమే అరుదుగా చూస్తుంటాం. కానీ ఒకే కేసులో తొమ్మిది మంది పోలీసు అధికారులకు మరణశిక్ష పడటం అనేది వ్యవస్థలోని లోపాలను సరిదిద్దే దిశగా ఒక బలమైన హెచ్చరికగా మారింది. చట్టం ముందు అందరూ సమానమేనని, యూనిఫాం వేసుకున్నంత మాత్రాన ఎవరి ప్రాణాలనైనా తీసే హక్కు లేదని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. ఖాకీ చొక్కా వెనుక దాగి ఉన్న క్రూరత్వాన్ని చట్టం సహించబోదని, అధికారం అనేది ప్రజల సేవ కోసమే కానీ వారిని హింసించడానికి కాదని న్యాయస్థానం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ తీర్పు వెలువడిన తర్వాత బాధిత కుటుంబ సభ్యులు తమకు న్యాయం జరిగిందని ఆవేదనతో కూడిన సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన జయరాజ్, బెన్నిక్స్ మళ్ళీ తిరిగి రారు కానీ వారి మరణానికి కారణమైన వారికి శిక్ష పడటం ద్వారా సమాజంలో న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరిగిందని వారు పేర్కొన్నారు. మదురై జిల్లా కోర్టు ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులకు ఒక గుణపాఠంగా మారుతుందని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అరాచక శక్తులు పోలీసు విభాగంలో ఉంటే సమాజానికి కలిగే ముప్పు ఎంత తీవ్రంగా ఉంటుందో ఈ ఘటన నిరూపించింది. భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కాలరాసిన పోలీసులకు మరణశిక్షే సరైనదని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. స్టేషన్లలో జరిగే దౌర్జన్యాలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని, పౌరుల ప్రాణాలకు భద్రత కల్పించడంలో వైఫల్యం చెందితే పరిణామాలు ఇలాగే ఉంటాయని హెచ్చరించారు. అధికారం చేతిలో ఉందని అహంకారంతో వ్యవహరించే వారికి ఈ ఉరిశిక్ష తీర్పు ఒక అద్దం పడుతోంది. నేరస్తులు ఎవరైనా చట్టం నుండి తప్పించుకోలేరనే సందేశాన్ని ఈ తీర్పు ద్వారా న్యాయస్థానం సమాజానికి పంపింది. ఈ కేసు దర్యాప్తులో సిబిఐ చూపిన చొరవ, సేకరించిన కీలక ఆధారాలు నిందితుల మెడకు ఉరితాళ్లు బిగించాయి. ఫోరెన్సిక్ నివేదికలు, పోస్ట్‌మార్టం రిపోర్టులు తండ్రీకొడుకులపై జరిగిన దాడి తీవ్రతను కళ్లకు కట్టాయి. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ఎంత ప్రయత్నించినా సత్యం చివరకు గెలిచింది. ఒక మహిళా కానిస్టేబుల్ తన తోటి ఉద్యోగులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడం అనేది అత్యంత ధైర్యంతో కూడిన చర్యగా నిలిచింది. ఆమె ఇచ్చిన వాంగ్మూలం కారణంగానే నిందితుల అసలు స్వరూపం బయటపడి శిక్ష పడటానికి మార్గం సుగమమైంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో రక్షక భటులు ప్రజలకు స్నేహితుల్లా ఉండాలే తప్ప శత్రువుల్లా మారకూడదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లాకప్ హింసను అరికట్టేందుకు సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను సత్తాంకుళం పోలీసులు గాలికొదిలేశారు. సీసీ కెమెరాల నిఘా ఉన్నా, ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉన్నా ఇలాంటి దారుణాలు జరగడం వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది.



# రాముడి భూములను తెలంగాణకు తెస్తారా?



**మొదటిపేజీ తరువాయి**

పరిపాలనాపరమైన సవరణల పేరుతో ఈ ఐదు పంచాయతీలను విడగొట్టారు. స్థానిక ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా, తెలంగాణ పాలకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం ఏకపక్షంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన వందలాది ఎకరాల భూములున్న పురుషోత్తమపట్నం కూడా ఏపీలో విలీనం కావడం భక్తులను తీవ్రంగా కలచివేసింది. దేవాలయం ఒక రాష్ట్రంలో, దానికి చెందిన ఆస్తులు మరో రాష్ట్రంలో ఉండటం వల్ల అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. పోలవరం ముంపుతో ఈ ఐదు గ్రామ పంచాయతీలకు నేరుగా ఎలాంటి సంబంధం లేదని తేలినప్పటికీ, వీటిని ఏపీలో కలపడం పట్ల ఆదివాసీ ప్రజలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం పట్టణంతో దశాబ్దాలుగా విడదీయలేని సంబంధం ఉన్న ఈ గ్రామాలను హఠాత్తుగా మరో రాష్ట్రంలో విలీనం చేయడం వల్ల ప్రజలు ఆచరణాత్మక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆదివాసీలు తమ వ్యవసాయ ఉత్పత్తులను పక్క గ్రామాలకు తీసుకెళ్లాలన్నా ప్రతిసారీ ఏపీ సరిహద్దు దాటి మళ్లీ తెలంగాణలోకి ప్రవేశించాల్సి వస్తోంది. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద నిత్యం తనిఖీలు, వాహనాల రాకపోకల నియంత్రణ వల్ల గంటల కొద్దీ సమయం వృథా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. శాంతిభద్రతల పేరుతో పోలీసులు చేసే సోదాలు సాధారణ పౌరులకు చుక్కలు చూపిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం భద్రాచలం ఆలయాన్ని సుమారు రూ. 300 కోట్లతో అత్యంత వైభవంగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ పనుల్లో భాగంగా భక్తులకు కనీస సౌకర్యాల కల్పన, ఆలయ భూముల్లో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే ఆలయానికి చెందిన 889 ఎకరాల భూమి ఏపీలో విలీనమైన పురుషోత్తమపట్నం పరిధిలో ఉండటంతో ఈ ప్రాజెక్టు ముందుకు సాగడం లేదు. భూమి ఒకరిది, అధికారం మరొకరిది అన్నట్లుగా తయారవ్వడంతో పరిపాలనాపరమైన చిక్కులు పెరిగాయి. తెలంగాణ సర్కారు ఎన్ని నిధులు కేటాయించినా పొరుగు రాష్ట్రంలోని భూముల్లో పనులు చేపట్టేందుకు సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గోదావరి నది హద్దు కారణంగా ఈ 19 గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. భౌగోళికంగా, సాంస్కృతిక పరంగా భద్రాచలంతో పేగుబంధం ఉన్న ఈ ఐదు పంచాయతీల ప్రజలకు ఏ చిన్న అవసరమొచ్చినా ఇప్పుడు 280 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాడేరుకు వెళ్లాల్సి వస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరుకు చేరుకోవడానికి రోడ్డు మార్గం గుండా ఎనిమిది గంటల సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి వస్తోందని గిరిజనులు గగ్గోలు పెడుతున్నారు. అదే భద్రాచలం అయితే కేవలం 40 కిలోమీటర్ల లోపే ఉంటుందని, గంట వ్యవధిలోనే పనులు పూర్తి చేసుకోగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనసు ఒక చోట, మనిషి మరో చోట అన్నట్లుగా తమ బతుకులు తయారయ్యాయని, తక్షణమే తమను తెలంగాణలో కలపాలని స్థానిక ప్రజాప్రతినిధులు అసెంబ్లీ వేదికగా అనేకసార్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఐదు గ్రామ పంచాయతీల ప్రజల కష్టాలను గుర్తించి, వాటిని తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం ఈ అంశంపై పలుమార్లు కేంద్ర హోం శాఖకు లేఖలు రాశారు. ప్రధాని మోదీని కలిసిన ప్రతి సందర్భంలోనూ చట్ట సవరణ చేయాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. ఏపీ రాజధాని విషయంలో మెరుపు వేగంతో స్పందించిన కేంద్రం, తెలంగాణ విజ్ఞప్తిని మాత్రం బుట్టదాఖలు చేయడం పక్షపాత వైఖరిని చాటుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న మొండి వైఖరిపై సామాన్య ప్రజల్లో సైతం అసంతృప్తి పెరుగుతోంది. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది మంది బీజేపీ ఎంపీలపై ఈ విషయంలో ఒత్తిడి పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న బండి సంజయ్ ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేస్తోంది. నిత్యం రామనామ జపం చేసే నేతలు, సాక్షాత్తు ఆ రాముడి భూములున్న గ్రామాలను తెలంగాణలో కలిపేందుకు ఎందుకు వెనకాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. చట్ట సవరణ ద్వారానే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, దీనికోసం పార్లమెంటులో పోరాడతామని చెబుతున్నారు. ఈ వివాదం రానున్న రోజుల్లో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మధ్య తీవ్రస్థాయి రాజకీయ పోరుకు దారితీసేలా కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత కేంద్రంపై ఉన్నప్పటికీ, రాజకీయ ప్రయోజనాల కోసం దానిని విస్మరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత పన్నెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య వల్ల కేవలం భూములే కాదు, వేలాది మంది ప్రజల జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. విద్య, వైద్యం వంటి అత్యవసర సేవలకు కూడా పొరుగు రాష్ట్రంపై ఆధారపడాల్సి రావడం గిరిజన ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులకు దారితీస్తోంది. పోలవరం ప్రాజెక్టు పేరుతో గిరిజనుల భూములను ఏపీలో కలిపిన కేంద్రం, ఇప్పుడు ప్రాజెక్టుతో సంబంధం లేని గ్రామాలను తిరిగి అప్పగించడంలో జాప్యం చేయడం వెనుక పెద్ద కుట్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ హక్కులను కాపాడటంలో రాష్ట్ర ఎంపీలు విఫలమవుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. రాజకీయ పార్టీల మధ్య నెలకొన్న ప్రచ్ఛన్న యుద్ధం వల్ల అంతిమంగా సామాన్య ప్రజలే నష్టపోతున్నారు. ముఖ్యంగా భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని ఆదివాసీలు తమ అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో కలిసి ఉన్న కుటుంబాలు, ఇప్పుడు రెండు రాష్ట్రాలుగా విడిపోవడంతో సామాజిక ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. సాంప్రదాయ పండుగలు, శుభకార్యాల కోసం సరిహద్దులు దాటడం వారికి పెద్ద ప్రహసనంగా మారింది.

# గుత్తి కోయల నీటి గోస

**మొదటిపేజీ తరువాయి**



కనీస మౌలిక వసతులకు నోచుకోని ఈ ప్రాంతంలో జీవన పోరాటం నిత్య కృత్యమైపోయింది. ముఖ్యంగా మండుతున్న ఎండల వేళ తాగడానికి గుక్కెడు నీరు దొరకక గిరిజన కుటుంబాలు అల్లాడిపోతున్నాయి. వారి ఆర్తనాదాలు అడవిలోనే అరణ్య రోదనగా మిగిలిపోతుండటం పౌర సమాజాన్ని కలచివేస్తోంది. నేటి ఆధునిక యుగంలోనూ ఒక బిందెడు నీటి కోసం కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి రావడం మన వ్యవస్థలోని వైఫల్యాలను ఎత్తిచూపుతోంది. నదులు, వాగులు పారుతున్నా, భారీ ప్రాజెక్టులు నిర్మిస్తున్నా అంచున ఉన్న ఈ గూడేలకు మాత్రం శాశ్వత తాగునీటి పరిష్కారం కలగానే మిగిలిపోయింది. ప్రభుత్వ పథకాలు కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితమవుతున్నాయా అన్న అనుమానం కలగక మానదు. నీటి కష్టాలు గిరిజనుల ప్రాణాలకు పరీక్షగా మారిన తరుణంలో, వారి కన్నీళ్లను తుడిచే నాథుడే లేకుండా పోయారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలు జరపకపోవడం, స్థానిక అవసరాలను పట్టించుకోకపోవడం వల్ల ఈ దుస్థితి దాపురించింది. ప్రతి వేసవిలోనూ ఇదే పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం వైపు అడుగులు పడటం లేదు. శాంతినగర్ గూడెంలోని గుత్తి కోయ గిరిజనుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వేసవి తీవ్రత దృష్ట్యా అందుబాటులో ఉన్న నీటి వనరులన్నీ ఎండిపోవడంతో గూడెం వాసులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దాహార్తిని తీర్చుకోవడానికి వేరే మార్గం లేక, ఎవరి సహాయం కోసం వేచి చూడకుండా తామే స్వయంగా రంగంలోకి దిగారు. కనీసం బావి తవ్వుకుంటేనైనా జలధారలు కనిపిస్తాయన్న ఆశతో గత ఇరవై రోజులుగా గూడెంలోని పురుషులు, మహిళలు ఏకమై శ్రమిస్తున్నారు. చెమటలు చిందుతున్నా, శరీరం సహకరించకపోయినా దాహం కేకలు వారిని విశ్రమించనివ్వడం లేదు. ప్రాణాలకు తెగించి సుమారు ముప్పై అడుగుల లోతు వరకు భూమిని తొలిచినా చుక్క నీరు పడకపోవడం వారిని తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఈ గూడెంలో నివసించే వారు కనీస సౌకర్యాల కోసం పోరాటం చేయాల్సి రావడం పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. ముప్పై అడుగుల లోతులో బావి తవ్వుతున్నప్పుడు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే పరిస్థితి ఏమిటన్న ఆందోళన వారిని వెంటాడుతున్నా, దాహం ముందు ఆ భయం చిన్నబోయింది. ప్రభుత్వం మిషన్ భగీరథ వంటి పథకాల ద్వారా ఇంటింటికీ నల్లా నీరు అందిస్తున్నామని గొప్పలు చెబుతున్నా, ఇలాంటి మారుమూల ప్రాంతాల్లో ఆ అడుగులు ఎందుకు పడటం లేదనేది సమాధానం లేని ప్రశ్న. భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోయిన తరుణంలో కేవలం బావులపై ఆధారపడటం ఈ రోజుల్లో అసాధ్యమని తెలిసినా, వారికి వేరే ప్రత్యామ్నాయం లేకపోవడమే అసలు సమస్య. ఎండలు తీవ్రమవుతున్న కొద్దీ గిరిజన పల్లెల్లో నీటి కోసం యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తెల్లవారుజాము నుంచే నీటి వేట మొదలవుతుంది. కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లినా బురద నీటినే వడపోసుకుని తాగాల్సిన దౌర్భాగ్యం వెంటాడుతోంది. దీనివల్ల గిరిజనులు అనేక ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. కలుషిత నీరు తాగి వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల పాలవుతున్నా యంత్రాంగంలో చలనం రావడం లేదు. గూడెం వాసులు తమ గోడును అధికారులకు విన్నవించుకున్నా, కేవలం హామీలకే పరిమితమవుతున్నారే తప్ప ఆచరణలో ఏ ఒక్క అడుగు ముందుకు పడటం లేదని స్థానికులు వాపోతున్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు ఉన్నప్పటికీ, అవి ఎక్కడికి పోతున్నాయనే చర్చ ఇప్పుడు మొదలైంది. రోడ్లు లేవు, విద్యుత్ సరిగ్గా ఉండదు, ఇక నీటి సంగతి చెప్పనక్కర్లేదు. ఇన్ని ఇబ్బందుల నడుమ బతుకులీడుస్తున్న గిరిజనుల ఓట్లను మాత్రం ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు అభ్యర్థిస్తారు. ఓట్లు వేయించుకుని గెలిచిన తర్వాత వారి మొహం చాటేయడం పరిపాటిగా మారింది. ప్రజాప్రతినిధులు ఏసీ గదులకే పరిమితమవకుండా ఇలాంటి కుగ్రామాలను సందర్శిస్తే వాస్తవ పరిస్థితి ఏమిటో తెలుస్తుంది.

# త్వరలోనే తులం బంగారం

- త్వరలోనే తులం బంగారం హామీని అమలు చేస్తాం
- ఐదేళ్లలో వంద శాతం హామీలను నెరవేరుస్తాం
- ఇప్పటికే రైతు రుణమాఫీ, ఉచిత బస్సు అమలు చేశాం
- సీఎం, మంత్రుల మధ్య ఎలాంటి విభేదాలు లేవు
- బీఆర్ఎస్ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోంది
- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాల విమర్శలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలు అంశం ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి కేంద్రబిందువుగా మారింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన ఆయువుపట్టుగా నిలిచిన ఆరు గ్యారెంటీల అమలుపై విపక్షాలు పదేపదే విమర్శలు గుప్పిస్తున్నాయి. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన వాగ్దానాల్లో అత్యంత ప్రజాకర్షకమైన పథకాలైన ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ రాయితీ, ఉచిత విద్యుత్ వంటి వాటిని ప్రభుత్వం ఇప్పటికే కార్యరూపంలోకి తీసుకువచ్చింది. అయినప్పటికీ, మరికొన్ని కీలక హామీల విషయంలో జాప్యం జరుగుతోందని, ప్రజలను ప్రభుత్వం వంచిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటుందని, ఏ ఒక్క హామీని కూడా విస్మరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీల్లో ప్రధానమైన మహాలక్ష్మి పథకం కింద మహిళలకు తులం బంగారం ఇస్తామన్న హామీపై ప్రస్తుతం పెద్ద ఎత్తున రచ్చ జరుగుతోంది. కళ్యాణలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయంతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ నాడు ప్రకటించింది. అయితే అధికారంలోకి వచ్చి సుమారు రెండున్నరేళ్లు గడిచినా, లబ్ధిదారులకు కేవలం నగదు రూపంలోనే చెక్కులు అందుతున్నాయని, బంగారం పంపిణీ ఎప్పుడు మొదలవుతుందో స్పష్టత లేదని విపక్ష నేతలు నిలదీస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగిన ప్రతిసారీ ప్రతిపక్ష పార్టీలు ఈ అంశాన్ని లేవనెత్తుతూ ప్రజల్లో అసహనాన్ని రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నాయి. దీనివల్ల క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నాయకులు కొంత ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. మరోవైపు భారతీయ జనతా పార్టీ అగ్రనేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరు గ్యారెంటీల అమలు తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగంగానే సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇతర అంశాలను తెరపైకి తెస్తోందని, ప్రజలకు ఇచ్చిన మాటను తప్పడం కాంగ్రెస్ నైజమని ఆయన విమర్శించారు. రైతులకు రుణమాఫీ విషయంలోనూ, నిరుద్యోగ భృతి విషయంలోనూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, తులం బంగారం హామీ ఏమైందని ఆయన నిలదీశారు. ఈ విమర్శల పరంపరను తిప్పికొట్టిన మంత్రి శ్రీధర్ బాబు, ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ వంటి భారీ వ్యయంతో కూడిన పథకాలను ప్రారంభించామని ఆయన గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఐదేళ్ల పదవీకాలం ముగిసేలోపు వందకు వంద శాతం హామీలను నెరవేరుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా వివాదాస్పదంగా మారిన తులం బంగారం పంపిణీని త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ఈ పథకం అమలుకు అవసరమైన విధివిధానాల రూపకల్పన జరుగుతోందని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పారదర్శకమైన పద్ధతిలో దీన్ని అమలు చేస్తామని వివరించారు. ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రతిపక్షాలు వాస్తవాలను గ్రహించాలని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేయడం తగదని ఆయన హితవు పలికారు. తాము అన్ని పథకాలను అమలు చేసిన తర్వాతే ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడుగుతామని ఆయన సవాల్ చేశారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ తీరుపై శ్రీధర్ బాబు తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆ పార్టీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించడంలో ఆరితేరిపోయారని, లేనిపోని అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన 420 హామీల సంగతేంటని ఆయన ప్రశ్నిస్తూ, ప్రజలు వారిని ఎందుకు తిరస్కరించారో ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యమైన వాగ్దానాలనే చేసిందని, వాటిని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా, ప్రజా సంక్షేమమే పరమావధిగా అడుగులు వేస్తున్నామని, అందులో భాగంగానే కొన్ని పథకాల విషయంలో స్వల్ప జాప్యం జరిగి ఉండవచ్చని ఆయన అంగీకరించారు. ప్రభుత్వంలోని కీలక నేతల మధ్య విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గం అంతా సమిష్టిగా పనిచేస్తోందని, విధానపరమైన నిర్ణయాల్లో అందరి భాగస్వామ్యం ఉంటుందని వివరించారు. సీనియర్ మంత్రులకు, ముఖ్యమంత్రికి మధ్య గ్యాప్ ఉందని ప్రచారం చేయడం ద్వారా ప్రభుత్వంపై అస్థిరతను సృష్టించాలని విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలా ముందుకు వెళ్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని, తమ మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవని ఆయన ఖరాకండిగా చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యం తప్ప వ్యక్తిగత ప్రయోజనాలు కాదని ఆయన వెల్లడించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రతిపక్షాలు ఓర్చుకోలేకపోతున్నాయని, అందుకే అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలని, నిరుద్యోగులకు ఉపాధి కలగాలని తాము శ్రమిస్తుంటే, విపక్షాలు మాత్రం అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు ఉండాలి కానీ, అవి నిర్మాణాత్మకంగా ఉండాలని శ్రీధర్ బాబు సూచించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను అభినందించే మనసు ప్రతిపక్ష నాయకులకు లేదని, నిరంతరం అసూయతో రగిలిపోతూ పాలనను అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తాము వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, అనుకున్న లక్ష్యాలను సాధించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. ఇక టీపీసీసీ అధ్యక్ష పదవికి సంబంధించి తన పేరు వినిపిస్తుండటంపై కూడా శ్రీధర్ బాబు వివరణ ఇచ్చారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను తాను ఎప్పుడూ చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, ప్రస్తుతం మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతగా ఆయన కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నారని, అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. పార్టీ నిర్ణయాలకు తాను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని, ప్రభుత్వం ద్వారా ప్రజలకు సేవ చేయడమే తన ప్రస్తుత లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నాయకత్వ మార్పుల గురించి సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నమ్మవద్దని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని సంక్షేమ పథకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. విద్యుత్ కోతలు లేకుండా చూడటంతో పాటు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, దీనివల్ల లక్షలాది కుటుంబాలకు మేలు జరుగుతోందని వివరించారు. అలాగే గృహజ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మిగిలిన పెండింగ్ హామీలను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని, త్వరలోనే రాష్ట్ర ప్రజలకు శుభవార్త చెప్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ వ్యూహాలన్నీ ప్రజా శ్రేయస్సు కోసమేనని ఆయన ఉద్ఘాటించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. కేవలం సంక్షేమమే కాకుండా, పారిశ్రామికాభివృద్ధి ద్వారా ఆదాయ మార్గాలను పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. దీనివల్ల సంక్షేమ పథకాల అమలు మరింత సులభతరం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల విమర్శలకు తాము భయపడబోమని, తమ పనితీరే వారికి సమాధానం చెబుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కూడా వాస్తవాలను గమనిస్తున్నారని, ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని ఎవరూ చెడగొట్టలేరని ఆయన అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలు ఇప్పటికే అనుభవిస్తున్నారని, ఆ నమ్మకమే తమకు కొండంత అండని ఆయన పేర్కొన్నారు.

# కొహెడ మార్కెట్ అమ్మకానికి రేవంత్ కుట్ర



**మొదటిపేజీ తరువాయి**

భూమిని ధారాదత్తం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పండ్ల మార్కెట్ కోసం నిర్దేశించిన స్థలాన్ని ఇతర అవసరాలకు మళ్లించడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి దాగి ఉందన్నది ఆయన ప్రధాన వాదనగా కనిపిస్తోంది. ఈ భూమిని విక్రయించేందుకు సంబంధించి ఇప్పటికే తెరవెనుక భారీగా మంతనాలు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కేరళ నుంచి వచ్చిన కొందరు దళారులతో కలిసి నగరంలోని ఒక ప్రముఖ లీలా హోటల్‌లో రహస్యంగా చర్చలు జరిపినట్లు హరీశ్ రావు సాక్ష్యాధారాలతో సహా ప్రశ్నిస్తున్నారు. రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసి, కేవలం కమీషన్ల కోసమే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన మండిపడ్డారు. మార్కెట్ యార్డు నిర్మించాల్సిన చోట కంపెనీలను తీసుకురావడం ద్వారా వేల కోట్ల రూపాయల భూదందాను సాగించాలని ప్రభుత్వం భావిస్తోందన్న ఆరోపణలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇది కేవలం భూమి మార్పిడి మాత్రమే కాదని, దీని వెనుక ప్రభుత్వ పెద్దల ప్రమేయం ఉందన్న అనుమానాలను ఆయన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కొహెడ మార్కెట్ స్థలానికి బదులుగా డెక్కన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కి చెందిన భూమిలో మార్కెట్ నిర్మించుకోవాలని ప్రభుత్వం చెబుతుండటంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దిల్ భూములకు సంబంధించి పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో న్యాయపరమైన చిక్కులు ఉన్నాయని, ఆ వివాదం ఇప్పట్లో తేలే అవకాశం లేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కోర్టు వివాదాల్లో ఉన్న భూములను రైతులకు కేటాయించడం అంటే వారిని గాలికొదిలేయడమేనని హరీశ్ రావు స్పష్టం చేశారు. స్పష్టత లేని భూములను చూపిస్తూ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిద్ధంగా ఉన్న భూమిని వ్యాపారవేత్తలకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ఆయన నిలదీశారు. వివాదాస్పద భూముల్లో మార్కెట్ నిర్మాణం సాధ్యం కాదని తెలిసినా ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడం వెనుక ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొహెడ పండ్ల మార్కెట్ అనేది కేవలం ఒక ప్రాంగణం మాత్రమే కాదు, అది సుమారు 25 వేల మంది రైతుల జీవనాధారం. ప్రతిరోజూ వేలాది మంది రైతులు తమ ఉత్పత్తులను ఇక్కడికి తీసుకువచ్చి వ్యాపారాలు సాగిస్తుంటారు. మార్కెట్ స్థలాన్ని మార్చడం లేదా భూమిని అన్యాక్రాంతం చేయడం వల్ల లక్షలాది మంది రైతుల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రైతుల పొట్ట కొట్టి దళారుల జేబులు నింపే ప్రయత్నాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హరీశ్ రావు హెచ్చరించారు. రైతాంగ ప్రయోజనాలను పక్కన పెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. రైతుల కోసం పని చేయాల్సిన ముఖ్యమంత్రి, ఇలా దళారుల కోసం ఆలోచించడం శోచనీయమని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం కొహెడ మార్కెట్ నిర్మాణానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. మార్కెట్ నిర్మాణానికి అవసరమైన స్థలంతో పాటు 350 కోట్ల రూపాయల నిధులను కూడా సిద్ధం చేసి ఉంచామని, అయినా పనులు ప్రారంభించకుండా జాప్యం చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని హరీశ్ రావు ప్రశ్నించారు. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు, భూమి సిద్ధంగా ఉన్నప్పుడు పనులు ఎందుకు ఆగిపోయాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల అవసరాలను గుర్తించకుండా ఆ స్థలాన్ని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు అప్పగించడం ద్వారా అక్కడ వాణిజ్య సముదాయాలు నిర్మించాలని చూడటం పెద్ద కుంభకోణానికి దారి తీస్తుందని ఆయన ఆరోపించారు. మార్కెట్ స్థలాన్ని టీజీఐఐసీకి బదిలీ చేయడం వెనుక ఉన్న వ్యూహాన్ని హరీశ్ రావు ఎండగట్టారు. పారిశ్రామిక అవసరాల పేరుతో భూమిని తీసుకుని, ఆ తర్వాత దాన్ని తమ అనుచరులకు కట్టబెట్టే పక్కా ప్రణాళికతో ప్రభుత్వం ఉందని ఆయన పేర్కొన్నారు. రైతులకు చెందాల్సిన భూమిని వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేయడం ద్వారా వచ్చే కమీషన్ల పైనే ప్రభుత్వం దృష్టి సారించిందని ఆయన ఘాటుగా విమర్శించారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన పాలకులే ఇలా విక్రయాలకు పాల్పడటం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టు వంటిదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల రైతుల్లో నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించాల్సిన బాధ్యత పాలక పక్షంపై ఉందని ఆయన గుర్తు చేశారు. కొహెడ పండ్ల మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా గుర్తింపు పొందుతుందని రైతు సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. అటువంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును నీరుగార్చి, ఆ భూమిని రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చాలని చూడటం దురదృష్టకరమని నిపుణులు భావిస్తున్నారు. ఈ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని, రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. భూమిని అన్యాక్రాంతం చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, రైతుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రతిపక్షాలు హెచ్చరిస్తున్నాయి. ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని ప్రభుత్వం భావిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హరీశ్ రావు హెచ్చరించారు. రాష్ట్ర రాజధాని చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములపై ఇప్పుడు అధికార పార్టీ నేతల కన్ను పడిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొహెడ మార్కెట్ స్థలం నగరానికి చేరువలో ఉండటం, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండటంతో ఆ భూమికి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. ఈ క్రమంలోనే ఆ భూమిని మార్కెట్ నుంచి వేరు చేసి ఇతర అవసరాలకు వినియోగించుకోవాలనే ఆలోచన ప్రభుత్వంలో మొదలైనట్లు తెలుస్తోంది. అయితే రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైనది కాదని రైతు బిడ్డలుగా చెప్పుకునే నాయకులు గ్రహించాలని విమర్శకులు సూచిస్తున్నారు. భూముల వేలం పేరుతోనో లేదా పెట్టుబడుల పేరుతోనో రైతుల భూములను లాక్కోవడం ప్రభుత్వ అనాలోచిత చర్యలకు నిదర్శనమని వారు అంటున్నారు. హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ వ్యవహారంలో తలదూర్చారని చెప్పడం ద్వారా చర్చను మరింత తీవ్రతరం చేశారు. లీలా హోటల్ వేదికగా జరిగిన చర్చల్లో ఎవరెవరు పాల్గొన్నారు, ఏయే ఒప్పందాలు జరిగాయనే విషయాలను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ భూదందాను అడ్డుకునేందుకు న్యాయపరంగా కూడా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. రైతుల పొట్ట కొట్టే ఏ నిర్ణయమైనా ప్రభుత్వానికి అరిష్టమని, వెంటనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే క్షేత్రస్థాయిలో ఉద్యమిస్తామని ఆయన ప్రకటించారు.

# 2034 వరకు మనదే రాజ్యం..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్ర రాజకీయ యవనికపై ప్రజా ప్రస్థానానికి ఆదిలాబాద్ గడ్డ వేదికైంది. గడీల పాలనను తుదముట్టించి ప్రజల చెంతకు పాలనను చేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో నిర్వహించిన 'ప్రజా పాలన - ప్రగతి బాట' బహిరంగ సభలో పాల్గొన్న ఆయన, గత పాలకుల విధానాలపై నిప్పులు చెరిగారు. తెలంగాణ సమాజం స్వేచ్ఛా వాయువులను పీలుస్తోందని, మళ్లీ పాత గడీల సంస్కృతిని రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాచరికపు ధోరణులతో సాగిన గత పదేళ్ల పాలనకు ప్రజలు తమ తీర్పుతో చరమగీతం పాడారని, ఇకపై రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధమైన పాలనే కొనసాగుతుందని ఆయన ఘంటాపథంగా చెప్పారు. పదేళ్ల పాటు అధికారాన్ని వెలగబెట్టిన వారు ఇప్పుడు మాయగాళ్ల రూపంలో ప్రజల ముందుకు వస్తున్నారని సీఎం విమర్శించారు. మారీచుల వేషంలో వచ్చి ప్రజలను మరోసారి వంచించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా ప్రతిపక్ష నేతలు ఇటీవల కొడంగల్, మహేశ్వరం వంటి ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వంపై విమర్శలు చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అక్కడ మార్కెట్ యార్డులు నిర్మించలేదంటూ మాట్లాడుతున్న వారు, తమ హయాంలో ఎందుకు ఆ పనులను పూర్తి చేయలేకపోయారో సమాధానం చెప్పాలని నిలదీశారు. గత పదేళ్లలో చేయలేని పనులను తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే పట్టాలెక్కిస్తుంటే, చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలకు దిగుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, గత పాలకుల వైఫల్యాల వల్ల కుంటుపడిన వ్యవస్థలను తాము చక్కదిద్దుతున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుంటే, ప్రతి అడుగులోనూ ఆటంకాలు సృష్టించాలని చూడటం ప్రతిపక్షాలకే చెల్లిందని ఎద్దేవా చేశారు. ఊరూరా తిరిగి పర్యటనలు చేస్తూ ప్రజల్లో అయోమయం సృష్టించడం కాదని, రాజకీయాల్లో కనీస సంయమనం పాటించాలని హితవు పలికారు. అభివృద్ధి పనుల పట్ల కొంత ఓపిక వహించాలని, నిర్మాణాత్మక సూచనలు చేయడం మాని కేవలం విమర్శల కోసమే విమర్శలు చేయడం తగదని సూచించారు. గత పాలకులు చేసిన తప్పుల వల్ల రాష్ట్రం ఆర్థికంగా ఎంతో నష్టపోయిందని ఆయన గుర్తు చేశారు.

ప్రజలు ఇప్పటికే గత పాలకుల బాగోతాన్ని పూర్తిగా చూశారని, వారి కుట్రలను అర్థం చేసుకున్నారని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిన వారికి మళ్లీ పట్టం కట్టే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పాలనలో పారదర్శకత పెరిగిందని, ప్రతి పౌరుడికి స్వేచ్ఛ లభించిందని చెప్పారు. గతంలో ప్రగతి భవన్ గోడల మధ్య బందీ అయిన పాలనను తాము వీధుల్లోకి తెచ్చి ప్రజల సమస్యలను నేరుగా వింటున్నామని వివరించారు. రాబోయే కాలంలో కూడా ప్రజా ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, ప్రజల ఆశీర్వాదంతో తాము 2034 వరకు సుస్థిరమైన పాలనను అందిస్తామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

అభివృద్ధి విషయంలో వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాంతంలోని సహజ వనరులను, పర్యాటక అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు. 2034 నాటికి ఆదిలాబాద్‌ను రాష్ట్రంలోనే అత్యంత అభివృద్ధి చెందిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ప్రకృతి రమణీయతకు నిలయమైన ఈ జిల్లాలో పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని చెప్పారు. గత పాలకులు ఆదిలాబాద్ ప్రయోజనాలను విస్మరించారని, తాము మాత్రం ఈ గడ్డపై పారిశ్రామిక విప్లవాన్ని తీసుకువస్తామని ముఖ్యమంత్రి సభాముఖంగా స్పష్టం చేశారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధితో పాటు విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌ను ఒక విద్యా కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా, జిల్లాలోనే నాణ్యమైన విద్యనందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పారిశ్రామిక వాడల ఏర్పాటు ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని, వ్యవసాయాధారిత పరిశ్రమలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో అభివృద్ధిని చూపిస్తామని ఆయన ప్రకటించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో గత ప్రభుత్వం అనుసరించిన అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టారు. రాష్ట్ర సంపదను కొద్దిమంది చేతుల్లో పెట్టి, సామాన్యులను విస్మరించిన తీరును తప్పుబట్టారు. ఇప్పుడు అధికారంలో లేని కారణంగా అశాంతికి గురవుతూ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తాము అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలు ప్రజలకు చేరుతుంటే ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం చేపట్టిన రుణమాఫీ వంటి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. పాలనలో సంస్కరణలు తీసుకువస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని, ఎవరు రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారో అందరికీ తెలుసని రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, అయితే ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని ప్రత్యర్థులకు సూచించారు. అభివృద్ధికి ఆటంకాలు కలిగించడం మానుకుని, రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందుతున్నాయని, దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపామని చెప్పారు. గతంలో భూ దందాలు, అక్రమాలకు పాల్పడిన వారు ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో తీవ్రంగా దుయ్యబట్టారు. ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కలలను నెరవేర్చే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన తెలిపారు. నీటి పారుదల ప్రాజెక్టుల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి సాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. గిరిజన బిడ్డల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను సాగిస్తామని, వారి హక్కులను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం శ్రమిస్తానని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం తాము రూపొందించిన విజన్ 2034 ప్రాముఖ్యతను సీఎం వివరించారు. రాబోయే దశాబ్ద కాలంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. అన్ని రంగాల్లోనూ సమతుల్య వృద్ధిని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. ఐటీ, పరిశ్రమలు, వ్యవసాయం వంటి కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటించారు. యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఇప్పటికే గ్రూప్ పరీక్షల నిర్వహణలో వేగం పెంచామని గుర్తు చేశారు. భవిష్యత్తు తరాలకు మెరుగైన తెలంగాణను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన బలంగా వినిపించారు.

# పొత్తుల్లేవు.. ఒంటరి పోరే!

- రాబోయే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు ఉండదు,
- గ్రేటర్ ఎన్నికల్లో 3 మేయర్ స్థానాలే లక్ష్యంగా బరిలోకి
- హైడ్రా కూల్చివేతలు, ఆరు గ్యారెంటీలపై రేవంత్ వైఫల్యం
- ఎన్నికల కోసం రాహుల్ గాంధీకి రేవంత్ రూ.1000 కోట్లు
- డొక్కు బస్సుల వల్ల ఆర్టీసీ వ్యవస్థ కుప్పకూలిందని విమర్శ
- ఖానాపూర్ మున్సిపాలిటీ విజయం చారిత్రాత్మకమని స్పష్టీకరణ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలతో పాటు రాష్ట్రంలో జరగబోయే ఇతర ఎన్నికల్లో పొత్తుల అంశంపై గత కొంతకాలంగా జోరుగా ప్రచారం సాగుతోంది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగానే ఇక్కడ కూడా కూటమి రాజకీయాలు తెరపైకి వస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్న తరుణంలో భారతీయ జనతా పార్టీ తన వైఖరిని కుండబద్దలు కొట్టినట్లు స్పష్టం చేసింది. ఏ పార్టీతోనూ రాజీ పడే ప్రసక్తే లేదని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రకటించడంతో రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేచింది. రాష్ట్రంలో ఎక్కడ, ఏ తరహా ఎన్నికలు జరిగినా భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు స్పష్టం చేశారు. పొత్తుల విషయంలో వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తమ పార్టీ సిద్ధాంతమే పరమావధిగా ముందుకు సాగుతామని ఆయన తేల్చి చెప్పారు. శాసనసభకు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధంగా ఉన్నాయని ఆయన ప్రకటించారు. గతంలో జరిగిన కొన్ని ఎన్నికల ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోయినప్పటికీ ఆ వైఫల్యాల నుంచి తాము గుణపాఠాలు నేర్చుకున్నామని ఆయన పేర్కొన్నారు. లోపాలను సరిదిద్దుకుని పటిష్టమైన యంత్రాంగంతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు వెల్లడించారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని రామచంద్రరావు ధీమా వ్యక్తం చేశారు. నగర పరిధిలోని మూడు మేయర్ స్థానాలను తమ ఖాతాలో వేసుకునే దిశగా ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన వివరించారు. గత మున్సిపల్ ఎన్నికల ఫలితాలను లోతుగా విశ్లేషించుకున్నామని, పట్టణ ఓటర్ల మనోగతాన్ని అర్థం చేసుకుని ఈసారి పక్కా వ్యూహంతో బరిలోకి దిగుతామని చెప్పారు. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో నెలకొన్న సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేస్తూ ఓటర్లకు చేరువయ్యేందుకు వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు ఆయన వివరించారు. అంతర్జాతీయ పరిణామాలను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని రామచంద్రరావు ఆకాశానికెత్తారు. ప్రపంచ దేశాలు యుద్ధ భయంతో వణికిపోతుంటే భారత్ మాత్రం మోదీ పటిష్టమైన నాయకత్వంలో సురక్షితంగా ఉందని ఆయన ప్రశంసించారు. దేశ ప్రజల భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎక్కడా రాజీ పడటం లేదని పేర్కొన్నారు. అదే సమయంలో దేశంలో లాక్‌డౌన్ విధించే అవకాశం ఉందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. అటువంటి ఆలోచన ఏదీ లేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం దేశ హితం కోసమే ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై ఆయన నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కాకుండా రాజకీయాల మీదనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి భారీ నిధులు సమకూర్చేందుకే ముఖ్యమంత్రి ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం మర్చిపోయి కేవలం మాటలకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని రామచంద్రరావు హెచ్చరించారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని రామచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఇళ్లను కూల్చివేయడం ద్వారా ప్రభుత్వం తన ఉనికిని చాటుకోవాలని చూడటం అన్యాయమని ఆయన మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి కూల్చివేతలే తప్ప రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఆయన ఎద్దేవా చేశారు. నగరాభివృద్ధికి నిధులు కేటాయించకుండా కేవలం హడావుడి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బడుగు బలహీన వర్గాలు బజారున పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని ఆయన పేర్కొన్నారు. కాలం చెల్లిన డొక్కు బస్సులను నడపడం వల్ల రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కుప్పకూలే స్థితికి చేరుకుందని ఆయన విమర్శించారు. సరైన నిర్వహణ లేక బస్సులు మధ్యలోనే ఆగిపోతున్నాయని తద్వారా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. ప్రచార ఆర్భాటం కోసం పథకాలు ప్రవేశపెట్టడం కాకుండా వాటిని పటిష్టంగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన తప్పుపట్టారు. దీనివల్ల ఆర్టీసీ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కృత్రిమ గ్యాస్ కొరతను సృష్టించడం వెనుక ప్రభుత్వం హస్తం ఉందని రామచంద్రరావు ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గ్యాస్ సరఫరాలో అంతరాయం కలగడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆయన దుయ్యబట్టారు. సామాన్యులకు నిత్యావసర వస్తువులను అందించడంలో కూడా విఫలమైన ప్రభుత్వం అధికారంలో ఉండే అర్హత కోల్పోయిందని ఆయన ఘాటుగా విమర్శించారు. గ్యాస్ ఏజెన్సీలపై నియంత్రణ లేకపోవడం వల్ల సామాన్య ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయం ఒక చారిత్రాత్మక మలుపు అని రామచంద్రరావు అభివర్ణించారు. అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు తమ వైపు ఉన్నారని ఈ ఫలితం నిరూపించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అడ్డదారుల్లో గెలవాలని చూసినా ఓటర్లు మాత్రం అభివృద్ధిని కాంక్షించి తమకే పట్టం కట్టారని ఆయన గుర్తు చేశారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని త్వరలో జరగబోయే అన్ని ఎన్నికల్లో ఇదే ఫలితాన్ని పునరావృతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా ఖానాపూర్ మున్సిపాలిటీ విజయాన్ని ప్రశంసించారు. కాంగ్రెస్ ఎత్తుగడలను చిత్తు చేస్తూ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేయడం పార్టీ కార్యకర్తల కష్టానికి ఫలితమని ఆయన కొనియాడారు. తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని దానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన విశ్లేషించారు. భవిష్యత్తులో గ్రేటర్ హైదరాబాద్ తో పాటు ఇతర కీలక పట్టణాల్లో కూడా తమ ఆధిపత్యాన్ని చాటుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్లేందుకు సిద్ధమవుతోంది. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారమే అజెండాగా కార్యాచరణను రూపొందిస్తోంది. పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని నిర్ణయించుకున్నారు. అటు జాతీయ స్థాయి నాయకత్వం కూడా తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఇక్కడి రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. మున్ముందు ఈ రాజకీయ పోరు ఏ మలుపు తీసుకుంటుందో చూడాలి. ఎవరితోనూ పొత్తు ఉండదని స్పష్టం చేయడంతో ఎన్నికల రణక్షేత్రంలో హోరాహోరీ పోరు తప్పదని తెలుస్తోంది.

## బీజేపీ జండా ఎగురవేసిన:సురేష్



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలం లోని దుర్గానగర్ గ్రామంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షులు రమావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మాక్లూర్ మండల ఇంచార్జ్ పాలేపు రాజు హాజరై బిజెపి పార్టీ జెండాను ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాక్లూర్ మండల ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ ముల్లంగి సర్పంచ్ ధర్మపతి సీనియర్ నాయకులు చింత ప్రవీణ్ రెడ్డి,రాజేశ్వర్ మండల ఉపాధ్యక్షులు భూక్యా సురేష్, మండల కార్యదర్శి విజయ్ రావు, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సిసింద్రి, హన్మగౌడ్,శ్రవణ్ కళ్యాణ్ నాయక్, సుబ్బు,శ్రీనివాస్, నారాయణ,శ్రీను, నవీన్ బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజగోపాల్ రెడ్డి మంత్రి కావాలని ప్రత్యేక పూజలు

**పూజ నిర్వాహిచిన పెద్దగోని మౌనిక రమేష్ గౌడ్**



**చౌటుప్పల్, విశాలభారతి:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి మంత్రి పదవి రావాలని రామలింగేశ్వర స్వామిని దర్శనం చేసుకొని ఆ భగవంతుణ్ణి వేడుకున్న కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ప్రతినిధి,యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దగోని మౌనిక రమేష్ గౌడ్ దంపతులు.తదనంతరం వారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి రావాలని చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గోత్రనామార్చన చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించి తెలంగాణ రాష్ట్రంలోనే పద ప్రజలకు ఆపద్బాంధవుడుగా ఉన్న ఏకైక శాసనసభ్యులు రాజగోపాల్ రెడ్డి మంత్రి కావాలని మరియు పబ్బు రాజు గౌడ్ ఉన్నతమైన స్థాయిలో ఉండాలని చెరువుగట్టు రామలింగేశ్వర స్వామిని వేడుకున్నామని ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు.

## అక్రమ మొరం తవ్వకాలపై పోలీసుల దాడులు



**నిజామాబాద్, విశాలభారతి:** జిల్లాలో అనుమతి లేకుండా సాగుతున్న అక్రమ మొరం తవ్వకాలపై పోలీసులు మెరుపుదాడి నిర్వహించారు. సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శసాయి చైతన్య ఉత్తర్వుల మేరకు సీసీఎస్ అధికారులు భారీ ఆపరేషన్ చేపట్టారు. నందిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలుగుట్ట వెనుక భాగంలో పెద్ద ఎత్తున మొరం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చింది. పోలీసుల రాకను గమనించిన నిందితులు అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ. సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి తవ్వకాలకు ఉపయోగిస్తున్న యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడిలో,3 టిప్పర్లు, 2 జేసీబీ లు,1 ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.స్వాధీనం చేసుకున్న వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం నందిపేట ఎసైచ్ కు అప్పగించారు. ప్రభుత్వ సంపదను కొల్లగొడుతూ అక్రమ తవ్వకాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. అనుమ తులు లేకుండా మొరం, ఇసుక తవ్వకాలు జరిపే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. నిరంతరం నిఘా కొనసాగుతుందనీ హెచ్చరించారు.

## అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి – సిపిఐ డిమాండ్



**ఆలేరు, విశాలభారతి:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో కొలనుపాక గ్రామంలో అర్హులైన పేదలకు వెంటనే ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ గుడిసెల లబ్ధిదారులను ఈరోజు సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షాన నిలబడి, అర్హులైన వారికి త్వరితగతిన ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని కోరారు.ఎన్నాళ్లుగానో ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేదల ఆకాంక్షను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పోతు ప్రవీణ్, మోతే భవాని, సంపత్, యాట ఉపేందర్, క్రాంతి, సుశీల, సరిత, లక్ష్మి, పొన్నబోయిన రవి, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి

**ఒకేసారి 16.38 లక్షల అందజేత**



**చౌటుప్పల్ విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం క్యాంప్ ఆఫీస్‌లో సోమవారం మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం 41 మందికి రూ.16,38,500 విలువైన చెక్కులు అందజేశారు. ముఖ్య అతిథులుగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, ఉమామహేశ్వరి సాయిలు, బద్రి గాలయ్య, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్ బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చింతల సాయిలు, మాజీ ఎంపిటిసి కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, ఓబిసి అధ్యక్షులు ఆవుల యేసు, ఉడుగు రమేష్, కళ్లెం దయాకర్ రెడ్డి, బండమీద వెంకటేష్, రావుల స్వామి, ఊదరి నరసింహ, దొనకొండ కృష్ణ, మదన్ గోపాల్, యూసఫ్, కొండూరు ధర్మేందర్ గౌడ్, పర్నె శివారెడ్డి, వీరమల్ల సత్తయ్య, సుర్కంటి చిన్న వెంకటరెడ్డి, ఊదరి యాదయ్య, మారుపాక ప్రభాకర్ గౌడ్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మోటకొండూరు, విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని మోటకొండూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, నాటి జాతీయ నాయకులు అటల్ బిహారీ వాజ్పేయి, ఎల్.కే. అద్వానీ సేవలను స్మరించుకున్నారు.మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, అటల్ బిహారీ వాజ్పేయి మరియు అద్వానీ వంటి మహానేతలు పార్టీని బలోపేతం చేసి, ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటూ ఈ స్థాయికి తీసుకువచ్చారని పేర్కొన్నారు.వారి స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, దేశవ్యాప్తంగా పార్టీ పటిష్టంగా నిలవడానికి అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిర్ర రవీందర్, తండ కృష్ణ, గాజుల బాలరాజ్, పల్లా జితేందర్ రెడ్డి, అనంతల పాండురంగారెడ్డి, మాల్గా అశోక్, సీస సత్యపాల్, సుల్తాన్ మహేందర్, రేగు నాగరాజు, పూర్ణ తిరుమలేష్, సొప్పరి సాయికుమార్, బాల్ద నర్సింలు, నమిలే సందీప్, ముడుగుల కార్తీక్, ఆత్మరాం, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**

**మహబూబాబాద్, విశాలభారతి:**



సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో , రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.అనిల్ కుమార్, అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న అన్ని విభాగాల జిల్లా అధికారులు ప్రతి సోమావారం నిర్వహించే ప్రజావాణి కి తప్పక హాజరు కావాలని లేనిచో శాఖాపరమైన చర్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ఈ సందర్భంగా కురవి మండలం కంచెర్ల గూడెం గ్రామానికి చెందిన బి. కవిత తన భర్త అనారోగ్యం కారణంగా చనిపోయాడని ఆర్థికంగా ఇబ్బంది ఉందని వితంతు పెన్షన్ ఇప్పించి ఆదుకోవాలని కోరారు. కేసముద్రం మండలం తౌర్య తండా కు చెందిన శ్రీనివాస్ తాను గతంలో గ్రామంలో చేసిన వివిధ అభివృద్ధి పనులకు గాను ఎం,బి ప్రకారం డబ్బులను ఇవ్వాలంటే తనకు కమిషన్ ఇవ్వాలని ప్రస్తుత సర్పంచ్ ఇబ్బంది పెడుతున్నారని తన సమస్యను పరిష్కరించి తన డబ్బులను ఇప్పించగలరని కోరారు. గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు తమ గ్రామంలో 90 శాతం మంది రైతులు వ్యవసాయం సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, తమ గ్రామ క్లస్టర్ లో రైతులు 70 శాతానికి పైగా మొక్కజొన్న పంట పండించారని తాము ఉన్న ప్రాంతానికి మొక్కజొన్న కొనుగోలు కేంద్రం చాలా దూరంగా ఉందని మా గ్రామం నందు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలని కోరారు. ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం గ్రామానికి చెందిన గుర్రం శివకృష్ణ తాను నిరుపేద వికలాంగుడినని మా గ్రామంలో పది సంవత్సరాలుగా రేషన్ డీలర్ ఇంచార్జి గా కొనసాగుతున్నారని అందువలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తనకు రేషన్ డీలర్ ఇంచార్జ్ ఇప్పించి నా కుటుంబానికి సహాయం చేయాలని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన ( 195 ) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ మధుసూదనరాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం,డి.పి.ఓ హరిప్రసాద్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. రవి రాథోడ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీమన్నారాయణ, ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్ కుమార్, జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారి కిరణ్ కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ యాదగిరి, డి వై.ఎస్.ఓ జ్యోతి, డి.ఈ.ఓ రాజేశ్వర్, డి.డబ్ల్యూ ఓ సబిత, మెప్మా పి.డి విజయ, హౌసింగ్ అధికారి భీమ్లా, ఎస్.ఈ ఎన్. పి.డి.సి.ఎల్ విజేందర్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేందర్, జిల్లా ఉపాధి అధికా రి రజిత, పరిపాలన అధికారి పవన్ కుమార్, భూభారతి జిల్లా కో.ఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోశాధికారిగా గార్లపాటి వెంకట్ రెడ్డి నియామకం

**మహబూబాబాద్, విశాల భారతి:**

మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గంలో కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన గార్లపాటి వెంకట్ రెడ్డికి కీలక పదవి దక్కింది. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన జిల్లా కోశాధికారి పదవికి ఆయనను నియమించడం స్థానికంగా, పార్టీ వర్గాల్లో ఆనందాన్ని కలిగించింది. గార్లపాటి వెంకట్ రెడ్డి గతంలో గుండ్రాతిమడుగు సొసైటీ అధ్యక్షులుగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహిస్తూ రైతులకు అందించిన సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ముఖ్యంగా రైతు సమస్యల పరిష్కారంలో చొరవ చూపడం, సహకార రంగ అభివృద్ధికి కృషి చేయడం, గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి కట్టుబడి పని చేయడం వంటి అంశాలతో ఆయనకు జిల్లా వ్యాప్తంగా మంచి పేరు వచ్చింది. కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, నియోజకవర్గ రాజకీయాల్లో సైలెంట్‌గా కానీ ప్రభావవంతంగా తన ముద్ర వేసుకున్న గార్లపాటి వెంకట్ రెడ్డికి ఈ పదవి దక్కడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ విశ్వాసాన్ని గెలుచుకున్న నాయకునిగా ఆయనకు డోర్నకల్ నియోజకవర్గంలో ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉన్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఈ సందర్భంగా స్పందించిన గార్లపాటి వెంకట్ రెడ్డి,



తనపై విశ్వాసం ఉంచి జిల్లా కోశాధికారి వంటి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, జిల్లా నాయకత్వానికి, అలాగే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల విస్తరణలో మరింత చురుకుగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గంలో గార్లపాటి వెంకట్ రెడ్డి నియామకంతో కురవి మండలం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. గ్రామీణ స్థాయి నుంచి ఎదిగి జిల్లా స్థాయి కీలక బాధ్యతను అందుకోవడం యువ నాయకత్వానికి ప్రేరణగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## భువనగిరిలో భరోసా సెంటర్ ఘన ప్రారంభం

**సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి**




**యాదాద్రి భువనగిరి, విశాలభారతి :** జిల్లాలోని భువనగిరి పట్టణంలో భరోసా సెంటర్‌ను తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి అదనపు డీజీపీ మహేష్ ఎం. భగవత్ తో కలిసి సోమవారం ఘనంగా ప్రారంభించారు. భరోసా సెంటర్ ప్రారంభానంతరం జిల్లా పోలీస్ అధికారులతో డీజీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ వంటి నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరాలను అరికట్టాలని, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ఆయన, ప్రతి కేసును సీరియస్‌గా తీసుకుని వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని తెలిపారు. మహిళలు, పిల్లల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, భరోసా సెంటర్ ద్వారా బాధితులకు తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తర్వాత జిల్లా పోలీస్ శాఖకు సంబంధించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ పనితీరు పై సమీక్ష నిర్వహించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని అధికారులను ప్రోత్సహించారు. రాష్ట్రంలో మావోయిస్టులు లేరని ఐదుగురు లేదా ఆరుగురు ఉండవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు వెంటనే విడుదల చేయాలని కలెక్టర్‌కు వినతి



**మోత్కూరు, విశాలభారతి :** బారాస ప్రభుత్వ హాయంలో రెండో విడతలో విడుదలై పెండింగ్ లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని దళిత బంధు మోత్కూరు, అడ్డగూడూరు మండలాల లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణిలో కలెక్టర్ అనురాగ్ జయంతి కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత బంధు నిధులలో అప్పటి ప్రభుత్వం 3 లక్షల రూపాయలు నిధులను విడుదల చేసిందని, ఈ పథకం క్రింద 10 లక్షలు రావాల్సి ఉండగా 3 లక్షలు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందని మిగతా 7 లక్షలు కూడా కలిపి లబ్ధిదారులకు అందజేసే విధంగా కలెక్టర్ ను కోరగా ఈ డబ్బులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ చిప్పలపల్లి మహేంద్ర నాథ్, దళిత బంధు లబ్ధిదారులు చెడిపల్లి రఘుపతి, బంగారయ్య, అంజయ్య, మహేందర్, కూరెళ్ళ రమేష్, బాలెంల నరేందర్, జిల్లా శివాజీ, జక్కులగిరి, ఇటికాల సుధాకర్, కూరెళ్ల మహేష్, నాగరాజు, రుద్రవల్లి గణేష్,బండి వెంకన్న ,సూరారం రాజు,రమేష్, ఎల్లయ్య,ఆనంద్,స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు పట్టణంలో మాస్కుల పంపిణీ – ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండల కేంద్రంలో కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై వ్యాపారస్తులు, పాదాచారులు, వాహనదారులకు మాస్కులను మున్సిపల్ చైర్పర్సన్ బాలమణి భాస్కర్ పంపిణీ చేశారు.ప్రజల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.పట్టణంలో రద్దీ ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం: ఎంఈఓ ఐ శాంతయ్య

**నాణ్యమైన విద్యకు కేంద్రంగా మన సర్కారు బడి.. సర్పంచ్ భాషమల్ల స్వాతి,భాస్కర్**




**తిరుమలగిరి, విశాల భారతి :** సోమవారం రోజు తిరుమలగిరి మండలం తొండ లో ఉన్నత, బీసీ కాలనీ ఎంపీపీ ఎస్ పాఠశాలలు బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడుతూ మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు తప్పకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. అలాగే ప్రభుత్వం పిల్లలకు అందిస్తున్నటువంటి సౌకర్యాలను వివరిస్తూ చెప్పడం జరిగింది. తల్లిదండ్రులు తప్పకుండా మన సర్కారు బడికి పంపిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాషమల్ల స్వాతి భాస్కర్, ఒకటో వార్డు నెంబర్ బండారు సంధ్య ఉప్పలయ్య, ఉపాధ్యాయులు ఎంపీపీ ఎస్ బీసీ కాలనీ ప్రధానోపాధ్యాయులు సైదులు, ఉపాధ్యాయులు వి వెంకటేశ్వర్లు,డి వెంకటి, సైదులు, రఘుపతి, వెంకన్న,విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ప్రజాపాలనప్రగతి నివేదికలో భాగంగా ఉచిత వైద్య శిబిరం



**మోటకొండూర్, విశాలభారతి:** మోటకొండూర్ మండల పరిధిలోని మాటూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన-ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ జన్నె సిద్ధులు, ఎంఎల్హెచ్పి పార్వతమ్మ, వార్డు సభ్యులు రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జన్నె సిద్ధులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఎంఎల్హెచ్పి శ్రీమతి పార్వతమ్మ మాట్లాడుతూ జీవనశైలి మార్పుల కారణంగా బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి ఎన్సీడీ వ్యాధులు పెరుగుతున్నాయని చెప్పారు.ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా మేరకు మందులు వాడడం, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం అవసరమని ఆమె ప్రజలకు సూచించారు.ఈ శిబిరంలో మొత్తం 82 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సాయికుమార్, వార్డు సభ్యులు భాగ్యమ్మ, విజయ, రమాదేవి, నరసింహులు, పరుశురాములు, వైద్య సిబ్బంది హెచ్ఈఓ నరసింహ, శ్రీనివాస్, సిస్టర్ విజయరాణి, ఆశా కార్యకర్తలు జయమ్మ, భార్గవి, సంతోష, రేణుక, కారోబారు శ్రీకాంత్, శానిటేషన్ సిబ్బంది సత్తయ్య, జంగమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలపై కలెక్టర్ ఫోకస్

**పెండింగ్ లేకుండా పరిష్కారం ఆదేశం**



**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 57 అర్జీలను స్వీకరించి మాట్లాడారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కరించాలన్నారు. అందులో రెవెన్యూ శాఖకు 35, జిల్లా గ్రామీణ అభివృద్ధికి 8, ఉపాధి కల్పనకు 2, మున్సిపాలిటీ 2, పంచాయతీ 2 అర్జీలు వచ్చాయి. విద్య, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, దేవాదాయ, ఆర్టీసీ, చేనేత, నేషనల్ హైవే, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజావాణిలో భాగంగా 32 ఫిర్యాదుల



**నిజామాబాద్, విశాల భారతి:** పోలీస్ ప్రజావాణిలో భాగంగా 32 ఫిర్యాదుల స్వీకరించారు.ఈ మేరకు సీపీ సాయిచైతన్య వివరాలు వెల్లడించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడిన సీపీ సంబంధిత పోలీసస్టషన్ ఇన్చార్జీలకు ఫోన్ ద్వారా సమాచారం మాట్లాడారు. చట్టపరమైన పరిష్కార మార్గం చూపాలని వారిని ఆదేశించారు. ప్రజావాణి అనంతరం సీపీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు నిర్భయంగా ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా ప్రజావాణిలో తనను సంప్రదించవచ్చన్నారు.స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా,శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని ఆయన అన్నారు. ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను పరిష్కరించుకునే మార్గం కల్పించేందుకే ప్రతి సోమవారం పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

# వడగళ్ల వానలతో సుద్ధపల్లిలో 500 ఎకరాల పంట నష్టం

**బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి**



**నిజామాబాద్ జిల్లా విశాలభారతి:** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం లోని డిచ్ పల్లి మండలం సుద్ధపల్లి గ్రామంలో సుమారు 500 ఎకరాలకు పైగా వడగళ్ల వర్షంతోని వరి మొత్తం కూడా దెబ్బతిన్నది. ఈ యొక్క పంటలను ఈరోజు నిజామాబాద్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు దినేష్ కులాచారి పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఒక ఎకరాకు 50 వేల రూపాయలు అందజేయాలని రైతన్న ఆరుగాలం పండించిన పంట అకాల వడగల వర్షంతో నీ నేలమట్టమైందని ఈ సందర్భంగా దినేష్ కులాచారి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాన్ని రైతులకు వర్తింపజేయాలని ఈ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి డిమాండ్ చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే అయినటువంటి భూపతిరెడ్డి ఇప్పటికి కూడా ఈ నష్టపోయిన పంటలను పరిశీలించకపోవడం సిగ్గుచేటు ప్రజలతోనీ ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని హైదరాబాదులో విలాసవంతమైన జీవితం గడపకూడదని ఈ సందర్భంగా దినేష్ డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ గవర్నమెంట్ రైతులను నట్టేట ముంచుతున్న ప్రభుత్వం ఈ ఒక రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వ్యవసాయ అధికారులతోని అంచనా వేసి నష్టపోయిన రైతన్నకు ఒక ఎకరాకు 50 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్ పల్లి మండలం రామడుగు, ఇతర గ్రామంలో కూడా అధిక వరి పంట నష్టపోయిందని వాపోయారు. ఈ యొక్క కార్యక్రమంలో డిచ్ పల్లి మండల అధ్యక్షుడు చంద్రకాంత్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ రెడ్డి యానంపల్లి సర్పంచ్ భాస్కర్, సర్పంచ్ లు,కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చౌకి లక్ష్మణ్ రమణ, రవి నాయక్ ,పరుశురాం, సుద్ధపల్లి సాంపల్లి, సుద్దపల్లి తండా,సాంపల్లి తండా వివిధ గ్రామస్తుల రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన మరియా తండా, బేల్యా తండా రైతులు



**నిజామాబాద్ జిల్లా విశాలభారతి:** ధర్పల్లి మండలం మరియా తండా, బెల్య తండా లో శనివారం కురిసిన వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంట నష్టాన్ని అంచనా వేసి ప్రతి రైతుకు సహాయం అందే విధాల చూడాలని జిల్లా కలెక్టర్ ను వేడుకున్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగ్లోత్ జ్యోతి గణేష్,ఉప సర్పంచ్ భాస్కర్, రైతులు రవి, బదావత్ రావు సింగ్ రాజేందర్, గోపాల్, వసంత్ ,కేతావత్ తిరుపతి.గ్రామ శాఖ అధ్యక్షుడు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# పాల ఉత్పత్తుల పరిరక్షణకు
# అమిత్ రెడ్డి అలుపెరగని పోరు



విజయ బ్రాండ్ నెయ్యి నాణ్యతపై గుత్తా అమిత్ రెడ్డి తొలి నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులు, పాడి రైతుల సంక్షేమం పని చేస్తూ... నాణ్యమైన పాల ఉత్పత్తులు అందరికీ అందాలన్న సదుద్దేశంతో ముందుకు కదులుతున్నారు. ఏపీ డెయిరీ ఫెడరేషన్ ఒక ప్రైవేట్ సంస్థ మేఘనా ఫుడ్స్ ఫ్రాంఛైజీ ఇవ్వగా, వారు గుజరాత్‌లోని ఒక డెయిరీ నుంచి నెయ్యిని సేకరిస్తున్నారని... గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ తతంగాన్ని ఆయన బహిర్గతం చేశారు. ఎన్డీడీబీకి చెందిన సీఏఎల్ఎఫ్ ల్యాబ్‌లో జరిపిన పరీక్షల్లో ఈ నెయ్యిలో వనస్పతి ఫ్యాట్ ఆనవాళ్లు ఉన్నట్లు తేలిందని, ఇది వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు అని తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. అంతే కాకుండా, స్థానిక రైతులకు ఎటువంటి సంబంధం లేని ఈ ప్రైవేట్ ఫ్రాంచైజీ నమూనా వల్ల రైతులకు ఒరిగేదేమీ లేదని, కేవలం బ్రాండ్ పేరును అమ్ముకుంటున్నారని అన్ని వేదికల్లో ఎత్తి చూపారు. పాడి రైతులకు న్యాయం జరగాలన్నదే తన ప్రధాన ఉద్దేశ్యమని చెబుతూ ముందుకు కదులుతున్నారు. అయితే, ఈ అంశంపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ, అమిత్ రెడ్డి వ్యక్తం చేసిన ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని తెలుపడం స్వాగతనీయం.



తెలంగాణలో విజయ బ్రాండ్ తరపున నకిలీ నెయ్యి అమ్ముతున్నారని గుత్తా అమిత్ రెడ్డి చేసిన ఆరోపణలు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారాయి. ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ స్పందించడం ఆసక్తి నెలకొంది. విజయ డెయిరీ బ్రాండ్ పేరుతో జరుగుతున్న నెయ్యి విక్రయాల్లో కల్తీ జరుగుతోందంటూ తెలంగాణ తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి చేసిన ఫిర్యాదుపై నారా లోకేష్ తక్షణమే స్పందించడం, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆయన హామీనివ్వడం అన్నివర్గాల్లో ఆసక్తి నెలకొల్పింది.

**విశాల భారతి - స్టేట్ బ్యూరో :**

ఏపీ డెయిరీ ఫెడరేషన్ ఇప్పటికే ఎప్పటికప్పుడు నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తోందని లోకేష్ చెప్పుకొచ్చారు. కాగా, ఈ ఫిర్యాదు కారణంగా మార్కెట్ నుంచి ర్యాండమ్ శాంపిల్స్ సేకరించి పరీక్షించాలని ఆదేశించినట్లు వివరించారు. తెలంగాణ డెయిరీ ఫెడరేషన్ వద్ద ఉన్న ల్యాబ్ రిపోర్టులను కూడా సేకరించి, వాటిని పరిశీలించిన తర్వాత తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని లోకేష్ స్పష్టం చేయడంతో... అమిత్ రెడ్డి పోరాటానికి మంచి న్యాయం జరిగింది. జిల్లా యూనియన్లు , రాష్ట్ర ఫెడరేషన్లు తమ సరిహద్దులు దాటి మార్కెటింగ్ చేయడంపై అమిత్ రెడ్డి చేసిన అభ్యంతరాన్ని లోకేష్ సున్నితంగా తిరస్కరించడంపై ప్రస్తుతం చర్చ జరుగుతున్నది. లోకేష్ వ్యాఖ్యలపై పాడి రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ప్రధాని నరేంద్ర మోడీ దార్శనికత అయిన వన్ నేషన్ వన్ మార్కెట్ సూత్రం ప్రకారం ఏ రాష్ట్ర ఉత్పత్తులైనా ఎక్కడైనా అమ్ముకోవచ్చని ఆయన గుర్తు చేయడం కొంచం అభ్యంతరకరంగా ఉన్నది. పాల ఉత్పత్తులకు ఈ విధానం వర్తించడంపై ఆ రంగానికి నిపుణులు, పాడి రైతులు లోకేష్ ప్రకటనపై తీవ్ర అక్షేపణ వ్యక్తం చేశారు. పాల ఉత్పత్తులకు గ్లోబల్ పాలసీ వర్తించవు... టెరిటరీ ఇబ్బందులుంటాయన్న విషయాన్ని లోకేష్ గుర్తించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తున్నాయి. అయితే, పాల వ్యాపారం చేయడానికి కూడా కొంత మేర టెరిటరీ రిస్ట్రిక్షన్ ఉంటుందని అమిత్ రెడ్డి చేస్తున్నారు. వ్యాపారం సంగతి పక్కన బెడితే డెయిరీ వినియోగదారుల ఆరోగ్యం, ఉత్పత్తుల నాణ్యత విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వం సరి చేసుకోవాల్సి ఉందని అమిత్ రెడ్డి ప్రతి సందర్భంలో నొక్కి చెబుతున్నారు. పాల్ప ఉత్పత్తుల కల్తీ, నాణ్యత, ఈ వ్యాపారంలో టెరిటరీ రిస్ట్రిక్షన్ లపై అలుపెరగని పోరాటం చేస్తున్న గుత్తా అమిత్ రెడ్డి, తొలి నుంచి పాడి పరిశ్రమ రైతులు, వినియోగదారుల ఆరోగ్యం విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదు. ఈయన పోరాటం వల్లనే విజయ డైరీ బ్రాండ్ల వివాదం రెండు రాష్ట్రాల మధ్య ఒక చర్చకు దారి తీసింది. కల్తీ నెయ్యి అమ్మకాలు, ప్రైవేటు సంస్థకు పాల అమ్మకాలు బాధ్యతలు ఏపీ అప్పగించిందని తెలంగాణ డెయిరీ నుంచి అమిత్ రెడ్డి ఉద్యమిస్తున్నారు. పూర్తిగా కల్తీ చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతుందని, ఇష్టానుసారంగా అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనికి వెంటనే ఏపీ నేతలు కౌంటర్ ఇచ్చినా... వివరణ సరిగా ఇవ్వలేకపోయారు. దాంతో వాళ్ళ అసలు కథ ఏంటో యావత్ ప్రపంచానికి అర్థం అయిపోయింది. తెలంగాణలో ఏపీ విజయ బ్రాండ్ ఉత్పత్తులు నాణ్యత దెబ్బతీస్తుందని,అక్కడి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ఫ్రాంచైజీలు ఇవ్వడంతో మార్కెట్లోకి కల్తీ పాలు, నెయ్యి వస్తున్నాయని బలంగా లేవనెత్తారు. మేఘన ఫుడ్స్ తయారు చేస్తున్న నెయ్యిలో వెజిటేబుల్ ఆయిల్ ఉన్నట్లు అందరికీ వివరించారు. ఏపీ ప్రభుత్వం రైతుల నుంచి పాల సేకరించి అమ్మకాలు చేయాలని, ప్రైవేటు సంస్థలకు పాల సేకరణ ఎందుకో అప్పగించింతో సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. ఏపీకి ఇక్కడ సహకార సంఘాలు లేవని, సరఫరా చేస్తున్న ఇస్తున్న నెయ్యి కల్తీగా ఉందని ఏపీ ఫెడరేషన్ ఫ్రాంచైజీ ఇస్తున్న నెయ్యిని పరీక్షలు చేయించామని అది పూర్తిగా కల్తీ ఉన్నట్ల ల్యాబ్‌రిపోర్టు వచ్చిందని అందరికీ తెలియజేశారు. గుజరాత్‌లో తయారైన నెయ్యి హైదరాబాద్ లో విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహించారు. తెలంగాణ డైరీ నాణ్యత కాపాడటం తన బాధ్యత అని... అందరి బాధ్యత అని అన్నారు. విజయ డైరీ పేరుతో ఎవరైనా తెలంగాణలో విక్రయాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. పాలను కొనుగోలు చేసేటప్పుడు తెలంగాణ లోగో చూడాలని, తక్కువ ధరకు వస్తుందని తీసుకుంటే ఆనారోగ్యం సమస్యలు వస్తాయని అమిత్ రెడ్డి అందరికీ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవడం సర్వత్రా పాజిటివ్ రెస్పాన్స్ వ్యక్తం అవుతుంది.



సాగర్ కేవీ, పాలసీ అనలిస్టు

# భూక్య శిరీషకు మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ నివాళి



**చిన్నగూడూరు విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలోని మేగ్యాతండా గ్రామానికి చెందిన భూక్య నరేందర్ సతీమణి భూక్య శిరీష రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం మేరకు, భూక్య శిరీష తన కుటుంబ అవసరాల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ వైపు వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో ఓ కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ముఖ్యంగా తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత స్వగ్రామానికి తరలించగా, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకుని భూక్య శిరీష భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ అక్కడికి చేరుకుని పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయని, ప్రతి ఒక్కరూ రహదారులపై అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. శిరీష మృతి బాధాకరమని, కుటుంబానికి ఇది తీరని లోటని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కాలు నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్య చిరంజీవి, మండల సోషల్ మీడియా అధ్యక్షులు బాదావత్ సురేష్, భూక్య బాసు నాయక్, గూగులోత్ రఘు, బాదావత్ శ్రీకాంత్, లక్ష్మణ్, బాదావత్ రెడ్డి, భూక్య వీరన్న, భూక్య రెడ్డి, పవన్, మురళి, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొని మృతురాలి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ, భూక్య శిరీష మృతి గ్రామానికి తీరని లోటని, ఆమె కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని కోరారు.

# ఐడిఓసి ఉద్యోగులకు జీవనశైలి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు

**నిజామాబాద్, విశాలభారతి:**

ఐడిఓసి ఉద్యోగులకు జీవన శైలి వ్యాధుల నిర్ధారణ పరీక్షల రెండు రోజుల ఆరోగ్య శిబిరాలను కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ శ్రీమతి ఇలా త్రిపాటి ఐఏఎస్ ప్రారంభించడం జరిగిందని జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐడిఓసి లో ఉన్న అన్ని శాఖల ఉద్యోగులు సుమారు 800 అందరూ జీవనశైలి వ్యాధులైన హైపర్ టెన్షన్, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ మొదలగు వ్యాధులకై నిర్ధారణ పరీక్షలను ఆరవ తేదీ మరియు ఏడవ తేదీ రెండు రోజులు ఉదయం 10 గంటలనుండి సాయంత్రం వరకు నిర్వహించడం జరుగుతుందని అందరి తప్పకుండా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలియజేశారు. ప్రతి ఉద్యోగి తన జీవన శైలిలో మార్పులను చేసుకుంటూ గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ లాంటి వ్యాధులకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యం పై హెల్త్ వీక్ నిర్వహించడం జరుగుతుందని దానిలో భాగంగా ఈరోజు ఆరోగ్య భద్రతపై అవగాహన దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు.దీనికోసం చక్కని పోషకాహారం, సిరి ధాన్యాలు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను మాత్రమే వాడాలి అన్నారు .ఈ సందర్భంగా ఉద్యోగుల కోసం సిరి ధాన్యాలు మరియు గానుగ నూనెలతో కూడిన మిల్లెట్ మేళాను కూడా నిర్వహించడం జరిగింది అన్నారు. ఇంకా ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించడమే కాకుండా మొబైల్ హ్యాండిల్ ఎక్స్రే మిషన్ ద్వారా ఎక్స్రే నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఉపా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ దేవి నాగేశ్వరి, ప్రోగ్రాం అధికారి ఎన్సీడీ డాక్టర్ వెంకన్న, డీఎస్ఓ డాక్టర్ వెంకటేష్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ అశ్విని, వైద్యులు డాక్టర్ సంజీవరెడ్డి, డాక్టరు భాస్కర్, డాక్టర్ అజ్మల్ ,డాక్టర్ కావ్య, డాక్టర్ సుసేన, డాక్టర్ సుప్రియ ,డాక్టర్ శిఖరా,డాక్టర్ అవంతి, డిపిఓ విశాల, డి పి సి వెంకటేశం, డి హెచ్ ఈ ఘన్ పూర్ వెంకటేశ్వర్లు, టీబీ కోఆర్డినేటర్స్ రవి గౌడ్, లక్ష్మణ్ ,నరేష్,ఎం ఎల్ హెచ్ పి లు, పర్యవేక్షణ అధికారులు ఏఎన్ఎంలు ,ఆశాలు పాల్గొన్నారు.



# ప్రజావాణికి 95 ఫిర్యాదులు



**నిజామాబాద్ , విశాలభారతి:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయాగౌడ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఆర్మూర్ ఏ.సీ.పీ వెంకటేశ్వర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 16వ తేదీన జరిగే మండల స్థాయి సభలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ నెల 2న నిర్వహించిన గ్రామ సభలు పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యాయని, అదే స్ఫూర్తితో మండల స్థాయి సభలను కూడా సమర్థవంతంగా జరిగేలా చూడాలన్నారు. మండల సభ నిర్వహణ సమయానికి ముందే ఇందిరమ్మ ఇళ్ళ పెండింగ్ బిల్లులు, రేషన్ కార్డులు, పెన్షన్లు వంటి వాటికి సంబంధించి గ్రామ సభలలో అందిన దరఖాస్తులను తప్పనిసరిగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరు వ్యక్తులకు కమ్యూనిటీ సర్వీస్

**అందులో భాగంగా అనాధాశ్రమం లో బియ్యం పంపిణీ కార్యక్రమం**

**రామగుండం, విశాలభారతి:** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి . రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్&డ్రైవ్ లో దొరికిన 10 మందిని, సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని, శ్రీ వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరచగా వారిలో 8 మందికి 16000 ఫైన్ వేయగా రెండోసారి దొరికిన ఇద్దరు వ్యక్తులకు 2000 రూపాయలు ఫైన్ వేస్తూ కమ్యూనిటీ సర్వీస్ లో భాగంగా అనాధాశ్రమంలో ఏవైనా వాళ్ళ అవసరాలకు ఉపయోగపడే వస్తువులను ఇవ్వమని ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మ పరివార్ అనాధాశ్రమంలో సోమవారం బియ్యం 75 కిలోల బియ్యం ఇవ్వడం జరిగింది. దానితోపాటు పండ్లు కూడా ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని వాహనానికి సంబంధించిన పత్రాలు ఉండాలని మరియు వాహనం తాగి నడపరాదని మరియు మైనర్లకు వాహనం ఇవ్వరాదని ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలని తెలియజేయడం జరిగింది.

# 5వ సం"రం దుర్గామాత పండుగ లగ్నపత్రిక రాయించిన గ్రామ పెద్దలు

**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల మండలం సింగరాజు పల్లి గ్రామంలో ఐదవ సంవత్సరం దుర్గామాత పండుగకు సంబంధించిన లగ్నపత్రికను ఈరోజు నూతన సర్పంచ్ కొండ ఊర్మిల మల్లారెడ్డి చేతుల మీదుగా పెద్దల సమక్షంలో పండుగ నిర్వహించబడు పండితులతో దుర్గామాత పండుగ లగ్నపత్రిక రాయించడం జరిగింది. ఈ పండుగను ఈనెల 25, 26 తేదీలలో శనివారం ఆదివారం రోజులలో ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ ఐక్యంగా సుఖసంతోషాలతో ఆయు రారోగ్యాలు పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, ఆకాంక్షించారు.కుల,మత బేదాలు లేకుండా అందరూ పాల్గొని పండుగను విజయవంతం చేయాలని, పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు, తదితరులు పాల్గొన్నారు.



# చిన్ననాటి మిత్రుడుని పరామర్శించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



**విశాల భారతి, రామగుండం :** హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్ననాటి మిత్రుడు జగన్ ని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సోమవారం నాడు పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ యొక్క ఆరోగ్య పరిస్థితుల గురించి ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జగన్ కు ప్రత్యేకంగా చికిత్స అందిస్తున్న వైద్య బృందంతో మాట్లాడి ప్రస్తుతం కొనసాగుతున్న చికిత్స విధానం, ఆరోగ్య పురోగతి గురించి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.

# తరంగ్ 2కె 26 అదిరే

**వేడుకగా అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవం**



**ముషీరాబాద్,విశాల భారతి:** బర్కత్ పుర లోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. 'తరంగ్ 2కె26' పేరుతో నిర్వహించిన వేడుకల్లో ఆట పాటలతో విద్యార్థులు తమదైన శైలిలో స్టెప్పులు వేసి ఆకట్టుకున్నారు. వెస్ట్రన్, క్లాసిక్ డాన్స్ ల తో అదరగొట్టారు. విద్యార్థులు తమ విద్యా నైపుణ్యాలతో పాటు కళాత్మక, సాంస్కృతిక ప్రతిభను ప్రదర్శించడానికి ఈ వేడుక ఒక చక్కని వేదికగా నిలిచింది. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు నైపుణ్యాలు ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని, దానికి భయపడాలిసన అవసరం లేదని ధైర్యం చెప్పారు. విద్యార్థులు సమాజంలో సమస్యలకు పరిష్కారాలు చూపేలా వినూత్న ఆలోచనలు చేయాలని, తల్లిదండులను, గురువులను ఎల్లప్పుడు గౌరవించాలని హితవు పలికారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, వై.రాజశేఖర్, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం. శ్రీనివాస్ రావు, ఎం.జ్ఞానేశ్వరి, డాక్టర్ ఎం.ప్రియాంక, ఐ. శ్రావణకుమార్, ఎంవిఎస్ఎస్ సందీప్, డాక్టర్ జయప్రద, డాక్టర్ ఎం.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘన సన్మానం

**జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా సురేష్ మోహన్**




**విశాలభారతి, అబ్దుల్లా పూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా సురేష్ మోహన్ మరోసారి రాష్ట్ర డి.పి.ఓ మరియు డి.ఎల్.పి.ఓల సంఘానికి అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాస్ తన బృందంతో కలిసి హాజరై సురేష్ మోహన్ ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరిగింది. సమస్యలు జిల్లా పంచాయతీ అధికారుల పరిధిలో ఉంటే వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అసోసియేషన్ తరఫున కోరగా, డీపీఓ సురేష్ మోహన్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.ఎల్.పి.ఓలు సాంబిరెడ్డి, సాధన, మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రవీణ్, సురేష్ గౌడ్, పండరినాథ్, జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, జిల్లా నాయకులు సూరిబాబు, ఇతర రాష్ట్ర, సంఘ బాధ్యులు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ని డీపీఓ సురేష్ మోహన్ సన్మానించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా గ్యాంగ్ గుట్టు రట్టు

**నలుగురు అరెస్ట్, పరారీ లో ప్రధాన నిందితుడు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పీడీఎస్ (ప్రజా పంపిణీ వ్యవస్థ) బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న గ్యాంగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..A1 అఖిల్ అలియాస్ బబ్లు (పరారీలో) మరియు A2 మొహమ్మద్ అమీర్ పాషా (30) ప్రధాన సూత్రధారులుగా ఉండి, A3 ఆడే రామ్‌దాస్ (42), A4 మీర్ ఫుర్కాన్ అలీ ఖాన్ (32), A5 జస్వంత్ రాయ్ (35) సహకారంతో హైదరాబాద్ నగరంలో పీడీఎస్ బియ్యాన్ని కిలోకు రూ.10 నుండి రూ.12 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ బియ్యాన్ని ఆటో వాహనాల ద్వారా కవాడిపల్లి గ్రామంలోని డంపింగ్ ప్రాంతానికి తరలించి, అక్కడి నుంచి కంటైనర్ లారీ ద్వారా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి పంపించి, కిలోకు రూ.18 నుండి రూ.20 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు దాడులు నిర్వహించి సుమారు 510 బస్తాల పీడీఎస్ బియ్యం (దాదాపు 300 క్వింటాళ్లు) స్వాధీనం చేసుకున్నారు. అలాగే TS02UC2829 నంబర్ గల కంటైనర్ లారీ, TG 12U3751 నంబర్ ఆటో, TS12T3265 నంబర్ గల అశోక్ లేలాండ్ వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని, పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

# నాగోల్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడి అరెస్ట్

**నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన బంగారు నగలు, ల్యాప్‌టాప్, యాక్టీవా బైక్‌ను స్వాధీనం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఇంటి దొంగతనం కేసులో పాత నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి సాయి నగర్, లలిత నగర్‌కు చెందిన కొమ్మెర నవీన్ (20) అనే యువకుడు నాగోల్‌లోని ఎకోపాలిట్ అపార్ట్‌మెంట్ నాలుగో బ్లాక్, ఐదో అంతస్తులో నివసిస్తున్న రమాకాంత్ కౌశిక్ ఇంట్లోకి కిటికీ గ్రిల్ తొలగించి చొరబడ్డాడు. కుటుంబ సభ్యులు నిద్రలో ఉన్న సమయంలో మరో బెడ్‌రూమ్‌లోని కబోర్డ్‌ను తెరిచి, రమాకాంత్ కౌశిక్ తల్లికి చెందిన సుమారు 10.5 తులాల బంగారు నగలు,ఒక నెక్లెస్, రెండు లాంగ్ చైన్లు, బ్లాక్ బీడ్స్ చైన్, గాజులు, ఉంగరాలుతో పాటు హెచ్‌పీ ల్యాప్‌టాప్‌ను దొంగిలించాడు. అదేవిధంగా ఒక యాక్టీవా బైక్‌ను కూడా అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను వివిధ కోణాల్లో పరిశీలించి నిందితుడిని గుర్తించారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన బంగారు నగలు, ల్యాప్‌టాప్, యాక్టీవా బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై నాగోల్, హయత్‌నగర్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు, ఇటీవలే జైలు నుంచి విడుదలై మళ్లీ దొంగతనానికి పాల్పడినట్లు సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డీఐ రుద్వీర్, డీఎస్ఐ నరసింహ, కానిస్టేబుళ్లు సుభాష్, సాయిష్, క్రైమ్ రైటర్ మౌనికలను సీఐ అభినందించారు.

# కరకగూడెం తహశీల్దార్‌గా సూర్యప్రకాష్ బాధ్యతల స్వీకరణ



**విశాలభారతి న్యూస్:** కరకగూడెం మండల తహశీల్దార్‌గా సూర్యప్రకాష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే తన ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఈటల

**ఎల్బీనగర్, విశాలభారతి :**



ఎల్. బి నగర్, మన్సూరాబాద్ డివిజన్, చంద్రపురి కాలనీలో 04న రోజున కాలనీ సంక్షేమ సంఘం సభ్యులందరూ కలిసి ఎవరికి ఇబ్బంది కలగకుండా కాలనీ ప్రాంగణంలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని దిమ్మను కూల్చివేసిన కారణంగా 5న ఉదయం కాలనీవాసులందరూ అక్కడికి విగ్రహాన్ని తీసుకొని వచ్చి ఏర్పాటు చేసుకోవడం జరిగింది. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విగ్రహం వద్దకు వచ్చి పూలమాలలు వేసి,టెంకాయలు కొట్టి వివిధ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, కాలనీవాసులు, యువకులు అందరూ ఒక తాటిపై ఉండి మహావీరుడైనటువంటి హిందూ సమాజం కొరకు తన ప్రాణాలను పణంగా పెట్టి హిందూ మతం కోసం పోరాడిన ఏకైక వ్యక్తి చత్రపతి శివాజీ విగ్రహం కోసం మీరందరూ కృషి చేసినందుకు హృదయపూర్వక అభినందనలు వారందరికీ తెలియజేశారు..ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఒక మహనీయుడైనటువంటి భారతదేశ హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ విగ్రహాన్ని జయంతి రోజు ఏర్పాటు చేసుకుందామని నిర్ణయించుకున్న 19న రోజున జయంతి వేడుకలు ఒక ఫ్లెక్స్ ఫోటోతో జయంతి వేడుకలు నిర్వహించుకొని పోలీసు వారు జిహెచ్ఎంసి వారు చేసిన విజ్ఞప్తిని స్వాగతించి విగ్రహాన్ని పెట్టకుండా వారికి సహకరిస్తే చత్రపతి శివాజీ వర్ధంతి రోజు అర్ధరాత్రి ఇంతటి దిగజారుడు దిక్కుమాలిన పనులు చేస్తారని ధ్వజమెత్తారు. పోలీసు అధికారులకు మరియు జిహెచ్ఎంసి అధికారులకు ఎందుకు చత్రపతి శివాజీ విగ్రహాన్ని చూస్తే ఎందుకు వణుకు పుడుతుందని హెచ్చరించారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా హిందూ మత సమాజం అధైర్యం కోల్పోకుండా విగ్రహాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేసుకుంటామని సంకల్పంతో ఏర్పాటు చేసుకోవడం ఎంతో గర్వకారణం అని అన్నారు..ఈ కార్యక్రమంలో వివిధ కాలనీలో అధ్యక్షులు, కార్యక్రమం నిర్వాకుడు లింగాచారి, నవీన్ షా, హరీష్ రెడ్డి, రోహిత్ పరంకుశం, సాయిరాం గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు..

# రోడ్ల మీద ఇసుక కుప్పలు పోస్తే జరిమానా

**మేయర్ మహంకాళి స్వామి**

**విశాల భారతి, గోదావరిఖని:**



రాకపోకలకు ఆటంకం కలిగేలా రోడ్ల మీద ఇసుక కుప్పలు , కంకర కుప్పలు పోస్తే వాటిని తరలించిన ఛార్జీలు వసూలు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ చిదురాల నాగరాజు తో కలసి సోమవారం 52 వ డివిజన్ కాకతీయ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం కొరకు తెప్పించిన కంకర , ఇసుక కుప్పలు రోజుల తరబడి రోడ్లపై చెల్లాచెదురుగా ఉండడంతో వాహనాలకు దారి లేకుండా ఇరుకుగా మారడంతో పాటు ప్రమాదాలకు గురువుతున్నట్లుగా తమ దృష్టికివచ్చిందని అన్నారు. తన పర్యటనలో భాగంగా ఒకరి ఇంటి ముందు రోడ్డు మీద ఇసుక కుప్పఉండడం గమనించి వెంటనే తొలగించుకోవాల్సిందిగా సదరు ఇంటి యజమానికి హెచ్చరికలు జారీ చేశారు. అలాగే దుకాణ యజమానులు కూడా తమ సామాగ్రి రోడ్డుపై కాకుండా తమ ఆవరణ లోపల ఉంచుకోవాలని సూచించారు. జి సి బి ,బ్లేడ్ ట్రాక్టర్ , బాబ్ కార్ట్ , 15 మంది డ్రెయిన్ క్లీనర్ల సేవలను ఉపయోగించుకొని కాకతీయ నగర్ లో ఉన్న పెద్ద మురుగు నీటి కాలువ లో సుమారు కిలో మీటర్ పూడిక తొలగించడంతో పాటు , కాలువ ప్రక్కన పెరిగిన పిచ్చి చెట్లు , చెట్ల కొమ్మలు తొలగించి పరిశుభ్రం చేశారు . మేయర్ మహంకాళి స్వామి అధికారులకు , సిబ్బందికి సూచనలు ఇస్తూ పూడిక తొలగింపు పని పూర్తి చేయించారు. దుర్వాసన , పాముల బెడద తో గత కొన్ని ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న తాము కాలువ పూడిక తీత , పొదల తొలగింపు తో సమస్య తీరిపోయిందని పరిసరవాసులు హర్షం వ్యక్తం చేశారు. కాలువలో పూడిక చేరకుండా ఉండడానికి చెత్త వేయకుండా సహకరించాలని కాలనీ వాసులను మేయర్ స్వయంగా అభ్యర్థించారు. శిధిలమైన కాలువ పునర్నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను ప్రక్కకు తరలించాలని ఆదేశించారు. రామగుండం నగరాన్ని అందంగా తీర్చిదిద్దాలనే ఎం ఎల్ ఎ , నగర పాలక సంస్థ పాలక వర్గం చేస్తున్న ప్రయత్నానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు ఈ సంధర్భంగా ఆయన వెంట పలువురు కార్పొరేటర్లతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎ ఇ. జమీల్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ , జవాన్ దయాకర్ తదితరులు ఉన్నారు.

# మామిడి సీజన్ సందడి

- బాటసింగారం పండ్ల మార్కెట్‌లో అధికారుల తనిఖీలు
- గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్ రెడ్డి

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**



మామిడి పండ్ల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం ఉదయం బాటసింగారం పండ్ల మార్కెట్‌ను మార్కెట్ కమిటీ పాలకవర్గం సందర్శించి మామిడి క్రయ విక్రయాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులను కమిషన్ల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధిక రసాయనాలు ఉపయోగించి పండ్లను పండించినట్లు తేలితే సంబంధిత లైసెన్సులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. గత ఏడాది సుమారు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి నమోదైందని, ఈ ఏడాది ఇంకా అధికంగా రావచ్చని అంచనా వేస్తున్నామని తెలిపారు. మామిడి సీజన్ సందర్భంగా రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులకు ప్రస్తుతం మంచి ధర లభిస్తున్నదని, అయితే కొందరు మధ్యవర్తులు అధిక కమిషన్ల పేరుతో రైతులను దోపిడీ చేయడానికి ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోయినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. అదేవిధంగా పండ్లను పండించేందుకు ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ అనుమతించిన ఎథనాల్ మాత్రమే ఉపయోగించాలని, దానిని అధికంగా వినియోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి వారం మార్కెట్‌ను తనిఖీ చేస్తూ పరిస్థితులను సమీక్షిస్తామని, అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాస్కర చారి,కమిటీ సభ్యులు బండి మధుసూదన్ రావు, మచ్చెందర్ రెడ్డి, గణేశ్ నాయక్, నరసింహ, రఘుపతి రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం తదితరులతో పాటు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీఐ అంటే పారదర్శక పాలన డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**



సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారానే దేశంలో పారదర్శక పాలన సాధ్యమవుతుందని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు, మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాస్, మోహసిన్ పర్వీన్, దేశాల భూపాల్, సినీ నటుడు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అధికారుల్లో జవాబుదారీతనం పెరిగినప్పుడే అవినీతి నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు శక్తివంతమైన ఆయుధమని, దీనిపై అవగాహన పెంపొందించడం అత్యవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కమిషన్లు లేక ప్రజలు ఇబ్బందులు పడిన విషయాన్ని గుర్తుచేస్తూ, ప్రస్తుత ప్రభుత్వం అన్ని కమిషన్లు ఏర్పాటు చేయడం పారదర్శక పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యావంతులు, ఉద్యోగస్తులు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు కలిసి ఆర్టీఐపై ప్రజల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. సమాచార కమిషనర్ పి.వి. శ్రీనివాస్ మాట్లాడుతూ..అనేక మంది త్యాగాల ఫలితంగానే ఈ చట్టం అమలులోకి వచ్చిందని తెలిపారు. అధికారులు పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశాల భూపాల్ మాట్లాడుతూ.. గతంలో దాదాపు 18 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మోహసిన్ పర్వీన్ మాట్లాడుతూ..చట్టంలో కొన్ని లోపాలు ఉన్నాయని, సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, జాతీయ ఉపాధ్యక్షులు గోపినాథన్ కట్టెకోల, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, జాతీయ సహాయ కార్యదర్శి వంగల వివేకానందు, రాష్ట్ర కన్వీనర్ కిఫాయత్, అధికార ప్రతినిధి కాశీ సతీష్ కుమార్, కోకన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగటి రాజకుమార్, ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్, కార్యదర్శులు కడమంచి అజయ్ కుమార్, సోమవారం రవి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి స్థాపన దినోత్సవం



**సికింద్రాబాద్, విశాలభారతి:** బీజేపీ స్థాపన దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి గుడ్ విల్ హోటల్ వద్ద పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టీ పట్ల తమ అంకితభావాన్ని చాటుతూ, దేశాభివృద్ధి కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. కార్యక్రమం మొత్తం దేశభక్తి నినాదాలతో, కాషాయ జెండాలతో సందడి వాతావరణంలో జరిగింది.ఈ కార్యక్రమములో జిల్లా ప్రధానకార్యదర్శి కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి,రాచమల్ల కృష్ణమూర్తి,కనకట్ల హరి ,నాగేశ్వర రెడ్డి అంబాల రాజు,ప్రభుగుప్తా,ఆకారం రమేష్,కుమారస్వామి,నీలి శ్రీనివాస.ముఠా గణేష్,శ్యామ్ సందీప్,అరవింద్,సతీష్షాజ్,రమేష్ గౌడ్,సురేష్ముదిరాజ్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**సికింద్రాబాద్, విశాలభారతి :** భారతీయ జనతా పార్టీ 47 వఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బౌధానగర్ డివిజన్ లో పలు చోట్ల పార్టీ జండా ను ఆవిష్కరించడం జరిగినది.దేశ సేవనే ధ్యేయంగా, భరత జాతి గౌరవాన్ని కాపాడే సంకల్పంతో ముందుకు సాగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ భారతీయ జనతా పార్టీ. అనే గొప్ప సిద్ధాంతంతో పనిచేస్తున్న ఈ పార్టీ లో భాగం కావడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాను. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు హృదయపూర్వక శుభాకాంక్షలు.దేశ అభివృద్ధి కోసం మనం అందరం కలిసి ముందుకు సాగుదాం అని కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తిహర్షకిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో కంటెస్ట్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, సీనియర్ నాయకులు సతీష్‌నేత , శ్యామరాజ్ ముదిరాజ్, బాలయ్య , క్రాంతి , ఉదయ్ , నరేష్, మహిళా నాయకురాళ్లు నాగరాణి , అమరావతి, యాదమ్మ, మమత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి మారుపేరు.. బిజెపి మాజీ కార్పొరేటర్

**స్వరూప గౌడ్**




**సికింద్రాబాద్, విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ 47వ'ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బౌద్ధ నగర్ డివిజన్ లోని పలు బస్తీలలో పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పతాకావిష్కరణలు బౌద్ధ నగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ ఆవిష్కరించడం జరిగింది. భారతదేశంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ సాధ్యంలో దేశం ప్రగతి పథంలో నడుస్తుందని దేశానికి బిజెపి శ్రీరామరక్ష అని స్వరూప గౌడ్ అన్నారు. డివిజన్ లో పార్టీని ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని కార్యకర్తల బలంతో అన్ని పోలింగ్ బూతులలో ని నివాసాలపై పతాకావిష్కరణ గావించడం జరిగిందని స్వరూప గౌడ్ అన్నారు. గతంలో తాను కార్పొరేటర్ గా ఉన్న సమయంలో డివిజన్ లో పార్టీ డివిజన్ ప్రజల సహకారంతో 25 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేసి అగ్రస్థానంలో ఉంచాలని స్వరూప గౌడ్ తెలిపారు. స్థానిక ప్రజా సమస్యలపై ఇప్పటికి పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలు తెలుసుకుని అటు సమస్యలను అధికారుల సహకారంతో పూర్తి చేయడం జరుగుతుందని స్వరూప గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో.....నాయకులు నేతి సత్యనారాయణ,వెంకట చైతన్య, నాగరాజు, జయంత్, ఓములు, శ్రీశైలం, బిక్షపతి, సంపత్, కుమార్, సారధి, సాగర్, సాయి ప్రసాద్, లింగం ముదిరాజ్, రాజు, అగుల్ల శీను, నీలేష్, శ్యామ్ రాజ్ , సత్యనారాయణ ముదిరాజ్ ,మృత్యుంజయ్, బాలయ్య, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బోథ్ సమస్యల పరిష్కారానికి సీఎం దృష్టి

**కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి వినతిపత్రం అందజేత**

**ఆదిలాబాద్ జిల్లా, విశాల భారతి:** తెలంగాణ ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ముఖ్యమంత్రిని హెలిప్యాడ్ వద్ద శాలువాతో సన్మానించి, ప్రాంతానికి సంబంధించిన పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.వినతిపత్రంలో బోథ్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను ప్రస్తావించారు. బోథ్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, డిగ్రీ కళాశాల స్థాపన, క్రీడ మైదానం మరియు క్రీడా పాఠశాల నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. అలాగే ధన్నూర్ బి గ్రామపంచాయతీని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖలతో సమీక్ష చేసి త్వరలోనే పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. స్థానిక ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం – డాక్టర్ పనీష్

**శ్రీరాంనగర్‌లో హోమియోపతి వైద్య శిబిరం**



**మొయినాబాద్, విశాలభారతి:** సంపూర్ణ ఆరోగ్యానికి సరైన పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో అవసరమని, దీంతో మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను నివారించవచ్చని ముచ్చింతల్ జిమ్స్ దవఖాన వైద్యులు డాక్టర్ పనీష్ తెలిపారు. మొయినాబాద్ మండల పరిధిలోని శ్రీరాంనగర్ గ్రామంలో హోమియోపతి దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిమ్స్ దవఖాన ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఎర్రుల గీతా మహిపాల్, ఉపసర్పంచ్ సుమలత మేన్నెడ్డి ప్రారంభించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలకు మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పనీష్ మాట్లాడుతూ, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వల్లే ఎక్కువ మంది మధుమేహం, రక్తపోటు సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. ఆకుకూరలు, కూరగాయలు, తక్కువ చక్కెర ఉన్న పండ్లు తీసుకోవడం ద్వారా ఈ వ్యాధులను నియంత్రించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనుమంత్, వార్డు సభ్యులు అమరేందర్ రెడ్డి, జంగయ్య, ప్రభాకర్, రమేష్, దీనా, మాధవి, కీర్తి, రాజు, సామేల్, నాయకులు ఎర్రుల మహిపాల్, సుధాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, వెంకటేష్, శ్రీశైలం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపాక పద్మకు "దళిత రత్న" పురస్కారం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల సందర్భంగా, సమాజానికి విశిష్ట సేవలందించిన వ్యక్తులను గుర్తించి అందజేసే "దళిత రత్న" పురస్కారం ఈ ఏడాది సామాజిక సేవకురాలు చిన్నపాక పద్మకి లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా జరిగిన కార్యక్రమంలో, అనాథ పిల్లలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సూర్య ప్రభ అగ్రో పార్క్స్ అధినేత చిన్నపాక పద్మని ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. పెద్ద అంబర్పేట్ డివిజన్ పసుమముల గ్రామం శ్రీనగర్ కాలనీకి చెందిన చిన్నపాక పద్మ, చిన్నపాక శ్రీనివాస్ జీవిత భాగస్వామి. సమాజంలోని పేద, అనాథ పిల్లల సంక్షేమం కోసం ఆమె చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు చిన్నపాక పద్మకి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఆమె సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## హయత్ నగర్ డివిజన్‌లో ఘనంగా జెండా ఆవిష్కరణలు

**హయత్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హయత్ నగర్ డివిజన్ పరిధిలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కాలనీల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ సందర్భంగా అనుమగల్ శివాలయం, హైవే బావార్చి పరిసరాలు, పెద్దమ్మ దేవాలయం, రంగనాయకుల గుట్ట, భాగ్యలత మెయిన్ రోడ్, భూలక్ష్మి నగర్, శారదా నగర్, సుభద్ర నగర్, కమలా నగర్, ముదిరాజ్ కాలనీ, ఆంధ్ర కేసరి నగర్ తదితర ప్రాంతాల్లో పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. ప్రతి ప్రాంతంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీపై తమ అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలకు మిఠాయిలు పంచుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోంది. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి వర్గానికి న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. హయత్ నగర్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షులు గంగానే శ్రీనివాస్, ఎస్సీ మోర్చా నాయకులు పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందాచారి, మహిళా అధ్యక్షురాలు గీత, సీనియర్ నాయకురాలు పార్వతి తోపాటు కార్యకర్తలు, యువ నాయకులు, మహిళా విభాగ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కిస్మత్పూర్‌లో జెండా ఆవిష్కరణ



**రాజేంద్రనగర్, విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిస్మత్పూర్ 122వ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్ 154లో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. బూత్ ప్రెసిడెంట్ ఉదయ్ గౌడ్, నాగరాజు రెడ్డి ఆధ్వర్యంలో పోచమ్మ టెంపుల్ సమీపంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీజేపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేఎంసీ బీజేపీ జనరల్ సెక్రటరీ నీరుడు పవన్ సాయి, మాజీ కార్పొరేటర్ ప్రశాంత్ నాయక్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ రావు, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, కిస్మత్పూర్ మాజీ ఉపసర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్, స్వామి, ప్రవీణ్ గౌడ్, సాయి రెడ్డి, వెంకటేశ్, నర్సింగ్ రావు, పవన్ బాబు, శంకరయ్య, అశోక్, శేఖర్, వెంకటేశ్, గణేష్, సాయి రెడ్డి, వివేక్, ప్రభాస్, వినయ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

## మూసి సుందరీకరణపై అభిప్రాయ సేకరణలో ఉద్రిక్తత



**రాజేంద్రనగర్, విశాలభారతి :** మూసి నది సుందరీకరణ ప్రాజెక్టు భాగంగా నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశం ఉద్రిక్తంగా మారింది. రాజేంద్రనగర్ సర్కిల్ 19 మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి గాంధీ సరోవర్, మధు అపార్ట్‌మెంట్ ప్రాంతాలకు చెందిన బాధితులు భారీగా హాజరయ్యారు. సమావేశంలో ప్రాజెక్టు లక్ష్యంపై స్పష్టత లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది గాంధీ సరోవర్ అభివృద్ధి కోసమా లేక మూసి నది సుందరీకరణ కోసమా అన్నది అధికారులు క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ నిర్ణయాలపై కూడా సందేహాలు వ్యక్తం చేశారు. తమ ఇళ్లపై క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ వాటిని అక్రమ కట్టడాలుగా ఎలా పరిగణిస్తున్నారని బాధితులు ప్రశ్నించారు. అలాగే, పని దినాల్లో సమావేశం నిర్వహించడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని, సరైన ప్రణాళిక లేకుండా పిలవడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వకుండా భూసేకరణ చేపట్టడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో బాధితులు ఆర్డీవోను నిలదీయడంతో కార్యాలయంలో తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని బాధితులను అడ్డుకున్నారు. మధు అపార్ట్‌మెంట్ వాసులను సముదాయించే ప్రయత్నం చేశారు. ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదు, కానీ మా ఇళ్లు ఇవ్వం" అని గాంధీ సరోవర్ ప్రాంత నివాసితులు స్పష్టం చేశారు. తమ సమస్యలను పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ సభలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది.

# అశ్వారావుపేటలో జూన్‌లో పేలనున్న ఫీజు బాంబ్స్

- అకాడమిక్ ఇయర్‌కు ఫీజులు సిద్ధం చేస్తున్న ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం
- అశ్వారావుపేటలో స్కూల్ పిల్లల తల్లిదండ్రులపై పెరుగుతున్న భారం
- స్కూల్స్ ఫీజుల నుంచి బస్ దోపిడీ వరకు ఇష్టారాజ్యం




**అశ్వారావుపేట, విశాలభారతి :**

అశ్వారావుపేట మండలంలో ముందస్తు స్కూల్ అడ్మిషన్లకు ప్రైవేట్ విద్యాసంస్థలు సిద్ధమవుతున్నాయి. ఇంకా అధికారికంగా అడ్మిషన్లు ప్రారంభం కాకముందే, స్కూల్ యాజమాన్యాలు ఫీజుల విషయంలో భారీగా పెంపులు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. జూన్ నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుండగా, ఈసారి ఫీజులు గతంతో పోలిస్తే మరింత పెరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది స్కూల్స్ అడ్మిషన్ పేరుతో అడ్వాన్స్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులకు టార్గెట్లు కొన్ని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఉపాధ్యాయులపై అడ్మిషన్ల కోసం టార్గెట్లు విధిస్తున్నట్టు సమాచారం. ఎంతమంది విద్యార్థులను చేర్పిస్తే అంత ప్రోత్సాహకం ఇస్తామని చెబుతూ, టీచర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. యూనిఫామ్, బుక్స్ స్కూల్‌లోనే కొనాలి... చాలా ప్రైవేట్ పాఠశాలలు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, షూస్ వంటి అవసరాలను తప్పనిసరిగా స్కూల్‌లోనే కొనాలని తల్లిదండ్రులను బలవంతం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బయట తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నా, స్కూల్‌లోనే కొనాలనే నిబంధనలు విధించడం వల్ల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఫీజులు ఎక్కువ - వసతులు తక్కువ తల్లిదండ్రులు చెబుతున్న వివరాల ప్రకారం: ఫీజులు భారీగా పెంచుతున్నా సరైన వసతులు లేవు క్లాస్‌రూమ్స్, ప్లేగ్రౌండ్స్ పరిమితంగానే ఉన్నాయి బస్సు, హాస్టల్, ఇతర సదుపాయాల పేరుతో అదనపు ఛార్జీలు వేస్తున్నారు సెలవులు తక్కువ... ఒత్తిడి ఎక్కువ ప్రైవేట్ స్కూల్స్‌లో విద్యార్థులకు సరైన సెలవులు ఇవ్వకుండా నిరంతరం క్లాసులు నిర్వహించడం వల్ల పిల్లలపై మానసిక ఒత్తిడి పెరుగుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2వ శనివారం కూడా క్లాసులే... ప్రతి నెల 2వ శనివారం సెలవు ఉన్నప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను స్కూల్‌కు రప్పిస్తున్నాయి. అదనపు క్లాసులు, పరీక్షల పేరుతో పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లలపై మానసిక ఒత్తిడి పెరుగుతోంది ఈ విధమైన నిరంతర ఒత్తిడి వల్ల విద్యార్థులు మానసికంగా అలసటకు గురవుతున్నారు. కొంతమంది పిల్లలు చదువుపై భయం, ఆందోళనకు గురవుతుండగా, తీవ్రమైన ఒత్తిడి తట్టుకోలేక తీవ్రమైన ఆలోచనలు కలుగుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల వాహనాల్లో నిర్లక్ష్యం కొన్ని ప్రైవేట్ స్కూల్స్‌కు చెందిన వాహనాల్లో విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించుకోవడం ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తోంది. చిన్న పిల్లలను ఒకే వాహనంలో గుంపులుగా తీసుకువెళ్తుండటం తల్లిదండ్రుల్లో భయాందోళనలు కలిగిస్తోంది. అదనంగా, కొన్ని వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడం, ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు, ఇన్సూరెన్స్ వంటి నిబంధనలు పాటించకపోవడం కూడా వెలుగులోకి వస్తున్నాయి. డ్రైవర్ల అర్హతలు, భద్రతా ప్రమాణాలపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. "రూల్స్ మాకు వర్తించవు" అంటున్న యాజమాన్యాలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు నియంత్రణ నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు తమ ఇష్టం వచ్చినట్లు ఫీజులు నిర్ణయిస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. నిఘా కరువు... అధికారుల నిర్లక్ష్యం ప్రైవేట్ స్కూల్స్‌పై పర్యవేక్షణ చేయాల్సిన సంబంధిత ప్రభుత్వ అధికారుల నుండి సరైన నిఘా లేకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. పలుమార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ, అధికారులు స్పందించకపోవడంతో యాజమాన్యాలు మరింత ధైర్యంగా వ్యవహరిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. తల్లిదండ్రుల ఆందోళన రోజురోజుకీ పెరుగుతున్న ఖర్చుల మధ్య, స్కూల్ ఫీజులు కూడా భారంగా మారడం వల్ల మధ్యతరగతి, కూలి వర్గాల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. "పిల్లలకు మంచి విద్య ఇవ్వాలనుకుంటే ఇంత భారీ ఖర్చు భరించడం కష్టంగా మారింది" అని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల జోక్యం అవసరం ఈ పరిస్థితుల్లో సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి, ప్రైవేట్ స్కూల్స్ ఫీజులపై నియంత్రణ విధించడం మాత్రమే కాకుండా, పాఠశాల వాహనాల భద్రతపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అడ్మిషన్ల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ప్రైవేట్ స్కూల్స్ ఫీజులు, వసతులు, భద్రతా ప్రమాణాల అంశాలు అశ్వారావుపేటలో మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. తల్లిదండ్రులపై పడుతున్న ఈ భారం తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## కిస్మత్పూర్‌లో అక్షర స్కూల్ వివాదం

**అనుమతులు, ఫీజులపై ప్రశ్నలు**




**రాజేంద్రనగర్, విశాలభారతి :**

కిస్మత్పూర్‌లోని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 'అక్షర' పేరుతో నడుస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ పాఠశాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పూర్తి స్థాయి అనుమతులు లేకపోయినా "ఇంటర్నేషనల్ స్కూల్" పేరుతో ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ పాఠశాలకు ఎనిమిదో తరగతి వరకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, ఎలాంటి అనుమతి లేకుండానే పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అలాగే, పాఠశాలకు కేవలం స్టేట్ బోర్డు సిలబస్ బోధించేందుకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, CBSE, కేంబ్రిడ్జ్ సిలబస్ బోధిస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలియజేస్తూ ఆకర్షిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బండ్లగూడ జాగిర్, కిస్మత్పూర్, హైదర్ షాకోట్ ప్రాంతాలకు చెందిన విద్యావంతులైన కుటుంబాలు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఫీజుల విషయంలో కూడా యాజమాన్యం అధికంగా వసూలు చేస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఎల్‌కేజీకి సుమారు రూ.2 లక్షలు వసూలు చేస్తుండగా, ప్రతి తరగతికి దాదాపు 10 శాతం చొప్పున ఫీజులు పెంచుతున్నట్లు సమాచారం. కార్పొరేట్ స్థాయి సదుపాయాలు ఉన్నట్లు ప్రచారం చేస్తూ భారీ ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

## ఆరోగ్య వారంపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం



**విశాలభారతి, నిజామాబాద్:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ ఆరవ తేదీ నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆరోగ్య వారం నిర్వహించడం జరుగుచిన్నదని, ఈ ఆరోగ్య వారాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి గారి ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ దిలీప్ సార్ అధ్యక్షతన వారి చాంబర్లో నిర్వహించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ మేడం తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా అదనపు కలెక్టర్ దిలీప్ సార్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారంలో అన్ని ఆరోగ్య దినోత్సవాలను జిల్లా అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ గారు మాట్లాడుతూ ఏప్రిల్ ఆరవ తేదీ మొదటి రోజు ఈరోజు ఫుడ్ సేఫ్టీ డే నీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆహార భద్రతపై అవగాహన, ర్యాలీ, ఉద్యోగులకు జీవన శైలి వ్యాధులపై నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. రెండవ రోజు అయిన ఏప్రిల్ ఏడవ తారీఖున ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దుబ్బా పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన ర్యాలీ మరియు ఐ డి ఓ సి రూమ్ నంబర్ 201 నందు అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడవరోజు ఏప్రిల్ 8వ తేదీన సేఫ్ మదర్ రోజును నిర్వహించడం జరుగుతుందని ఆరోజు జిల్లా స్థాయి లో గర్భిణీ స్త్రీలు బాలింతలకు వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మరియు మాతా శిశు మరణాలను తగ్గించడంపై అవగాహన కలిగించడం జరుగుతుంది అన్నారు. నాలుగవ రోజు ఏప్రిల్ 9వ తేదీన హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ మరియు నిర్ధారణ పరీక్షలను కేంద్రకారాగారంలోని ఖైదీలకు మరియు ట్రాన్స్ జెండర్ లకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐదవ రోజు ఏప్రిల్ 10వ తేదీన హోమియోపతి మరియు ఆయుర్వేద దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆరోజు కోటగల్లి పద్మశాలి సంఘం నందు యోగ పై అవగాహన మరియు హోమియోపతి మెడికల్ షాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరవ రోజు ఏప్రిల్ 11వ తేదీన డ్రగ్స్ కంట్రోల్ మరియు రెగ్యులేటరీ స్ట్రెన్తెనింగ్ రోజుగా నిర్వహించడం జరుగుతుందని డ్రగ్స్ క్వాలిటీ ,అవైలబిలిటీ మరియు రెగ్యులేటరీ కంప్లైంట్స్ ఆఫ్ మెడిసిన్స్ పై అవగాహన ఉంటుందని అన్నారు.

## ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం

**మొయినాబాద్‌లో జెండా ఆవిష్కరణతో వేడుకలు**

**మొయినాబాద్, విశాలభారతి:**

భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని మొయినాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి జెండా ఆవిష్కరణ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు మాధపురం శ్రీకాంత్ మాట్లాడుతూ, బీజేపీ స్థాపన నుంచి నిస్వార్థ ప్రజాసేవకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ రక్షణ, అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ రత్నం, కంజర్ల ప్రకాష్, మోర నర్సింహారెడ్డి, అత్తాపూర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు పడమటి మమత, మోహన్ రెడ్డి, షాబాద్ కిషన్, ముదిగొండ, సీనియర్ నాయకులు ప్రభాకర్, పట్లోల ప్రభాకర్ రెడ్డి, తూర్పు మాధవ రెడ్డి, పడమటి మోహన్ రెడ్డి, ప్రశాంత్ గౌడ్,తూర్పు శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం



**కూకట్ పల్లి విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఫతేనగర్ ప్రాంతంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్, ఫతేనగర్ బ్రిడ్జ్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ దేశాభివృద్ధి, సుశాసనం మరియు ప్రజా సేవ లక్ష్యాలతో ముందుకు సాగుతున్న పార్టీ అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, దేశ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాదేశ్యాం, సురేష్, శివ, రవి, ఉషారాణి, వినీత్, దినేష్, బాలరాజ్, గోపాల్, దశరథ్, రాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## త్యాగాల సిపిఐకి విరాళాలు ఇచ్చి ఆదుకోండి

**రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పిలుపు**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ప్రజా పోరాటాలతో వందేళ్లు పూర్తి చేసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కు ప్రజలే విరాళాలు అందించి ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మెట్టు మండల కేంద్రంలో సోమవారం ధర్మ బిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం సామూహిక విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో పీడిత ప్రజల తరపున నిరంతరం పోరాటాలు చేస్తూ వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ సిపిఐ అని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే పార్టీని ప్రజలే తమ వంతు సహకారంతో నిలబెట్టాలని, విరాళాలు అందించి పార్టీకి బలం చేకూర్చాలని కోరారు. ఈ నెల 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని అన్ని గ్రామాలు, ప్రాంతాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మెట్టు కేంద్రంలో ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, అన్ని వర్గాల ప్రజలు ముందుకు వచ్చి విరాళాలు అందించారని చెప్పారు. కార్మికులు, రైతుల పక్షాన, పీడిత వర్గాల తరపున సిపిఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్టు గ్రామ పంచాయతీ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, ఉపసర్పంచ్ తమ వంతు విరాళాలను అందజేశారు. అలాగే సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, మండల కార్యదర్శి అజ్మీర హరిసింగ్ నాయక్, సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, ఏషాల నరసింహ, పోన్నాల యాదగిరి, అరుణ, నవనీత, ఈశ్వర్, ధూపం మధు, సుజాత, నిరంజన్, దేవమ్మ, రాములు, రమేష్, యాదగిరి, మధు, వినోద్ నాయక్, వీరేష్, సాయిలు, లక్ష్మణ్, లక్ష్మి, మండల కౌన్సిల్, కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనగర్ కాలనీ సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం

**ప్రజాపాలనలో శ్రీనగర్ కాలనీ సమస్యలపై అధికారుల హామీ**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఎల్బీనగర్ జోన్ పరిధిలోని నాగోల్ సర్కిల్, పెద్ద అంబర్పేట్ డివిజన్ పసుమాముల గ్రామం శ్రీనగర్ కాలనీలో నెలకొన్న రోడ్డు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమంలో జోనల్ కమిషనర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ.. కాలనీలో అసంపూర్తిగా ఉన్నటువంటి డ్రైనేజ్ వ్యవస్థ అవుట్లెట్ కలెక్షన్ తోపాటు రోడ్డు గుంతలమయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వచ్చి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. వినతి పత్రాన్ని స్వీకరించిన జోనల్ కమిషనర్ మరియు జాయింట్ కమిషనర్ స్పందిస్తూ, శ్రీనగర్ కాలనీలో ఉన్న సమస్యలను త్వరలోనే శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేసి, సరైన అవుట్‌లెట్ కలెక్షన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టి, దెబ్బతిన్న రోడ్ల సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని, ప్రజలకు అవసరమైన పార్క్ అభివృద్ధి పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ హామీపై కాలనీ వాసులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, త్వరితగతిన పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కృష్ణ కుమారి, సిటీ ప్లానింగ్ సెక్షన్ అధికారులు శ్రీనివాస్ యాదవ్, ఏ ఈ కిరణ్మయి, శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాకూబ్ పాషా, జాయింట్ సెక్రటరీ హెచ్ డి ఎఫ్ సి శ్రీనివాస్, కల్చరల్ సెక్రటరీ శ్రీకాంత్ గౌడ్, కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బయట పరదా.. లోపల పనులు

## సీజ్ చేసినా ఆగని అక్రమ నిర్మాణాలు

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మియాపూర్ సర్కిల్లో అక్రమ భవన నిర్మాణాలకు అడ్డూ అదుపులేకుండాపోతోంది.అధికారులు బిల్డింగ్‌లను సీజ్ చేసిన వారం రోజుల్లోపే మళ్లీ నిర్మాణ పనులు మొదలుపెడుతున్నారు.భవన యజమానుల నుంచి అధికారులు స్లాబ్‌కొక ధర చొప్పున డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.మియాపూర్ సర్కిల్ పరిధిలోని కృషి నగర్, ఆదిత్య నగర్ కాలనీల్లో నిర్మిస్తున్న ఈ అక్రమ అంతస్తుల నిర్మాణాలకు అధికారులే అండగా నిలుస్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు. పత్రికల్లో వచ్చిన కథనాలతో తూతూ మంత్రంగా స్పందిస్తూ భవనాలను సీజ్ చేస్తున్నారు. ఆ తర్వాత యజమానులతో బేరసారాలు సాగించి అభయమిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.టౌన్ ప్లానింగ్ అధికారులు భవనానికి అదనపు అంతస్తులు నిర్మిస్తే నోటీసులు ఇవ్వడమే మా పని కూల్చివేయడం మా పని కాదని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో భవన నిర్మాణ యజమానులు యదేచ్ఛగా జీ+2 అనుమతులు తీసుకుని జీ+5 వరకు నిర్మిస్తున్నా చోద్యం చూస్తున్నారని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ముందుగా టౌన్ ప్లానింగ్ సిబ్బంది కాలనీలలో ఎక్కడెక్కడ నూతన నిర్మాణాలు చేపడుతున్నారో రెక్కీ నిర్వహించి నిర్మాణాలు చేపడుతున్న యజమానులకు ఏ అధికారిని కలిస్తే పని సులువుగా అవుతుందో సలహాలు, సూచనలిస్తూ వారే ముందుండి నడిపిస్తున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి.ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులతో నోటీసులు ఇప్పిస్తాం, అటు తర్వాత వారిని మేనేజ్ చేసి మీరు యదేచ్ఛగా కట్టుకోవచ్చని అభయమిస్తున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. దీనివల్ల రాబోయే రోజుల్లో కాలనీలో డ్రైనేజీ, తాగునీటి సమస్య మొదలవుతుందని కృషి నగర్, ఆదిత్య నగర్ కాలనీ వాసులు తెలుపుతున్నారు. కాలనీ వాసులే గతంలో అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేశారంటే ఈ దందా ఏ మేరకు కొనసాగుతుందో అర్థమవుతోంది. మియాపూర్ సర్కిల్ పరిధిలోని బికే ఎన్ క్లేవ్, ఆదిత్య నగర్ లో కొన్ని భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన తెల్లారే యజమాని భవనానికి అంటించిన బోర్డును తీసేసి తనపని తాను సాఫీగా చేసుకుంటూ, భవనానికి సున్నం కూడా వేయించాడు.మియాపూర్ లక్ష్మీ రెస్టారెంట్ వెనుకఉన్న మూడు భవనాలను సీజ్ చేశారు. కానీ బయట సీజ్ బోర్డు అలాగే కన్పిస్తున్నా లోపల మాత్రం మేస్త్రీలు నిర్మాణ పనులను సాఫీగా చేసుకుంటున్నారు. ఎంఏ నగర్ ఎదురుగా ఉన్న కృష్ణ నగర్ కాలనీలో భవనం ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా వెలుస్తున్న భవనాలను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు


కృషినగర్‌లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం


సీజ్ చేసిన బ్యానర్ను తొలగించి పనులు చేస్తున్న భవనం




### చర్యలు తీసుకుంటాం

**సర్కిల్ పరిధిలో సీజ్ చేసిన భవనాల్లో పనులు జరిగితే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసులను నమోదు చేస్తాం. భవన యజమానులు ఎంతవరకు అనుమతులు తీసుకున్నారో, దాని ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలి.**

**- రాణి అసిస్టెంట్ సిటీ ప్లానర్ మియాపూర్ సర్కిల్ 48.**



# ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈరోజు డివిజన్ పరిధిలోని కాటేదాన్‌లోని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం భాగంగా బాబు రెడ్డి నగర్, మైలార్దేవ్‌పల్లి ప్రాంతాల్లో కూడా వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ స్థాపక సిద్ధాంతాలపై వారు వివరించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ వేసిన పునాదులపై పార్టీ నిర్మితమైందని, దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాద సిద్ధాంతాన్ని పాటిస్తూ ముందుకు సాగుతోందన్నారు. అంత్యోదయ సిద్ధాంతంతో చివరి వ్యక్తికి ప్రయోజనం చేకూర్చడం పార్టీ లక్ష్యమని తెలిపారు.అలాగే అటల్ బిహారీ వాజపేయి, ఎల్.కే. అద్వానీ వంటి అగ్రనేతల మార్గదర్శకత్వంలో పార్టీ అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం అమిత్ షా, జేపీ నడ్డా నాయకత్వంలో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్‌ను విశ్వగురువుగా నిలిపే దిశగా పార్టీ కృషి కొనసాగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ నరగూడెం మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, విజయ్ కుమార్, సీనియర్ నాయకులు జోగి రవి, రావుల భాస్కర్, బొమ్మరాజు నరసింహ, డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనేక మంది పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యను వ్యాపారంగా మలిచిన ప్రభుత్వం

- **ఘాటుగా విరుచుకుపడ్డ టీఆర్‌పీ నేత**
- **కార్పొరేట్ స్కూల్ ప్రారంభోత్సవానికి సీఎం హాజరుపై ఆగ్రహం**
- **ఎల్బీనగర్ ఇన్చార్జ్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఇబ్రహీంపట్నం ప్రాంతంలో కార్పొరేట్ విద్యా వ్యవస్థపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలను అడ్డుకోవాల్సిన ప్రభుత్వం, అదే సంస్థల ప్రారంభోత్సవాలకు వెళ్లడం సిగ్గుమాలిన చర్య అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జి, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్ ఘాటుగా విమర్శించారు. ఏవిఎన్ లేక్ ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ పేరుతో ఇబ్రహీంపట్నంలో ప్రారంభమైన ఈ కార్పొరేట్ విద్యాసంస్థలో ఎల్‌కేజీ స్థాయిలోనే రూ.5 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సాధారణ ప్రజలకు అందని ఈ విద్యా వ్యవస్థను నియంత్రించాల్సిన ప్రభుత్వం, దానికి మద్దతుగా వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యాశాఖను తన గుప్పెట్లో పెట్టుకుని మరింత వ్యాపారమయం చేసిందని దుయ్యబట్టారు. ఇంటర్నేషనల్, గ్లోబల్, ప్రీమియం వంటి పేర్లతో కొత్త కొత్త స్కూల్స్ పేర్లు పెట్టి, అధిక ఫీజులు వసూలు చేయడం చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలని చెప్పే నాయకులు, మరోవైపు కార్పొరేట్ స్కూల్స్ ప్రారంభోత్సవాలకు హాజరవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో అలాంటి కార్యక్రమాలకు వెళ్లడం ప్రజలకు తప్పుదారి చూపే చర్యగా ఆయన అభివర్ణించారు.ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కుటుంబానికి చెందిన వ్యక్తి, బీజేపీ ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి నిర్వహిస్తున్న ఈ విద్యాసంస్థకు ప్రభుత్వం పరోక్షంగా మద్దతు ఇస్తోందని ఆరోపించారు. ఇప్పటికే డిపిఎస్ వంటి స్కూల్స్ ద్వారా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న నేపథ్యంలో, మళ్లీ అదే తరహా సంస్థలను ప్రోత్సహించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. కార్పొరేట్ విద్యా దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఈ విధానాలను తెలంగాణ రాజ్యాధికార పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని బొంగు వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు.

# పాల్వంచలో 'కీచక' వల:

**విద్యార్థినులు, గృహిణులే టార్గెట్.. ఫోటోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ హైటెక్ వ్యభిచారం**

**భద్రాద్రి ప్రతినిధి, విశాలాభారతి:** పారిశ్రామిక కేంద్రమైన పాల్వంచ పట్టణంలో నిశ్శబ్దంగా సాగుతున్న ఒక ప్రమాదకరమైన 'చీకటి వ్యాపారం' వెలుగులోకి వచ్చింది. అమాయక విద్యార్థినుల చదువులను, సామాన్య గృహిణుల సంసారాలను ఛిన్నాభిన్నం చేస్తూ ఒక మహిళా కిలాడీ సాగిస్తున్న 'హైటెక్' వ్యభిచార దందా ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ నివాసి , కాంట్రాక్టర్స్ కాలనీ అడ్డాగా చేసుకుని, అద్దె ఇళ్ల ముసుగులో ఈ 'కీచక పర్వం' కొనసాగుతోంది. బయట ప్రాంతాల నుంచి వచ్చి హాస్టళ్లలో ఉంటూ చదువుకునే విద్యార్థినులను ఈ నిర్వాహకురాలు ప్రధానంగా లక్ష్యంగా చేసుకుంటోంది. వారి ఆర్థిక బలహీనతలను పసిగట్టి, మాయమాటలతో బుట్టలో వేసుకుంటోంది. "తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు" అనే ఆశ చూపి, మెల్లగా వారిని వ్యభిచార ఊబిలోకి లాగుతోంది. కేవలం విద్యార్థినులే కాకుండా, మధ్యతరగతి గృహిణులను కూడా తన ఆర్థిక అవసరాల కోసం వాడుకుంటూ వారి జీవితాలను పణంగా పెడుతోంది. ఈ దందాలో ఉన్న అత్యంత భయంకరమైన కోణం బాధితులను భయపెట్టడం. పొరపాటున ఈ బురదలోకి దిగిన వారు, పశ్చాత్తాపంతో బయటకు రావాలని ప్రయత్నిస్తే ఆ నిర్వాహకురాలు అసలు స్వరూపాన్ని చూపిస్తోంది. బాధితుల వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతామని, మీ కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరింపులకు పాల్పడుతోంది. పరువు పోతుందనే భయంతో బాధితులు ఎవరికీ చెప్పుకోలేక, ఆ నరకంలోనే మగ్గిపోతూన్నారు. నిర్వాహకురాలు టెక్నాలజీని వాడుకుంటూ నెట్‌వర్క్‌ను విస్తరించింది.విటులను ఆకర్షించేందుకు వాట్సాప్ ద్వారా విద్యార్థినుల ఫోటోలు పంపడం, వీడియో కాల్స్ చేయించడం వంటి పనులకు ఒడిగడుతోంది. ఒక్కొక్కరి నుండి రూ. 10,000 నుండి రూ. 30,000 వరకు వసూలు చేస్తూ, బాధితులకు నామమాత్రపు సొమ్ము ఇచ్చి మిగిలినదంతా ఆమె జేబులో వేసుకుంటున్నట్లు సమాచారం. అనుమానం రాకుండా ఉండేందుకు బాగా చదువుకున్న వారు ఉండే 'అఫీషియల్' ఏరియాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యాపారం సాగిస్తున్నారు మరికొంత మంది నిర్వాహకులు. ఇటీవల ఈ కిలాడీ మహిళ వేధింపులు భరించలేక ఓ బాధిత మహిళ ధైర్యం చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఒక్క పాల్వంచలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా ఇలాంటి ముఠాలు హల్‌చల్ చేస్తున్నాయని, తక్షణమే పోలీసులు 'స్పెషల్ డ్రైవ్' నిర్వహించి తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కోహెడ మార్కెట్ తరలింపుపై కాంగ్రెస్‌పై హరీష్ రావు ఫైర్

- **బీఆర్ఎస్ పేరును చెరిపేసే కుతంత్రం... రైతుల హక్కులపై దాడి అంటూ మండిపాటు**
- **ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు స్థానిక మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కోహెడ పండ్ల మార్కెట్‌ను అర్ధాంతరంగా తరలించే కుట్రపై కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. రైతుల ఆవేదనను తెలుసుకునేందుకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, స్థానిక మాజీ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి తో పాటు టిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు,ఎమ్మెల్యేలు స్వయంగా స్థలాన్ని సందర్శించి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ..హరీష్ రావు, రైతుల కష్టాలను పట్టించుకోని ఈ ప్రభుత్వం, కేవలం రాజకీయ ప్రతీకారంతో ముందుకెళ్తోంది అంటూ తీవ్రంగా విరుచుకుపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ నిర్మాణానికి భూమి కేటాయించి, రూ.350 కోట్ల నిధులు సమకూర్చిందని గుర్తుచేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు కనబడకూడదనే కక్షతో, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మార్కెట్‌ను తరలించేందుకు ప్రయత్నిస్తోంది. ఇది రైతులపై బహిరంగ దాడి... వారి హక్కులను తుంగలో తొక్కే చర్య అంటూ ఆయన మండిపడ్డారు. రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేసిన మార్కెట్‌ను రాజకీయ కారణాలతో మూసివేయడం అన్యాయమని, ఇది పూర్తిగా దురుద్దేశపూరిత చర్య అని విమర్శించారు. రైతుల కష్టార్జిత జీవనాధారంపై ఇలా దాడి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయటపెడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రరెడ్డి , ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి , కాలేరు వెంకటేష్ , భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ నూతన చైర్మన్ మరియు కౌన్సిలర్‌లను సన్మానిస్తూ, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి)ను హరీష్ రావు అభినందించారు.

# నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి



**మణుగూరు, విశాలభారతి :** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం మణుగూరు పోలీస్ స్టేషన్ ను సందర్శించారు .ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న మణుగూరు పోలీస్ స్టేషన్ భవనాన్ని కూడా ఈ సందర్భంగా ఎస్పీ పరిశీలించారు.పాత పోలీస్ క్వార్టర్స్ పరిసరాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

# గ్రామీణ క్రీడలకు నిధులు కేటాయించాలి




**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

**మొయినాబాద్, విశాలభారతి:**

కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో క్రీడా అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదని అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. మొయినాబాద్ మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన మోర శంకరయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మాజీ ఎంపీటీసీ మోర శ్రీనివాస్ తన తండ్రి జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 14 జట్లు పాల్గొన్న ఈ పోటీలో రెడ్డిపల్లి, కుతుబుద్దీనూడ జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో రెడ్డిపల్లి జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.27,777 నగదు, షీల్డ్, రన్నర్ జట్టుకు రూ.17,777 నగదు, షీల్డ్‌ను సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యం తగ్గిందని, ప్రభుత్వం క్రీడా అభివృద్ధికి నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నప్పటికీ సరైన సౌకర్యాలు లేక వారు ముందుకు రాలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 18 వేల పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తే విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రతి మండలంలో కనీసం పది ఎకరాల స్థలంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు.పెద్దమంగళారం గ్రామ పరిధిలో గతంలో కేటాయించిన క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని కోరారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతామని తెలిపారు.క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ఈ టోర్నమెంట్ నిర్వహించిన నిర్వాహకులను ఆమె అభినందించారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు చారెడ్డి వెంకట్రెడ్డి, సీనియర్ నాయకులు కోట్ల నరోత్తంరెడ్డి, శ్రీహరి యాదవ్, గునుగుర్తి జయవంత్, సుధాకర్ యాదవ్, రవియాదవ్, కృష్ణారెడ్డి, డప్పు రాజు, ఎండీ పాషా, ఎండీ అహ్మద్, ఈశ్వర్, సర్పంచ్లు, క్రికెట్ నిర్వాహకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# 7వ డివిజన్లో నెలకొన్న సమస్యలపై గ్రీవెన్స్‌లో వినతి

**కలెక్టర్ స్పందించి సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని హామీ**

**పాల్వంచ, విశాలభారతి:**



కొత్తగూడెం మున్సిపల్ కోర్పరెషన్,7వ డివిజన్ లో నెలకొనివున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సోమవారం గ్రీవెన్సలో జిల్లా కలెక్టర్ కు సమస్యలతోకూడిన వినతిపత్రాన్ని స్థానిక ప్రజలు అందించారు. కొన్ని సంవత్సరాలుగా 7వ డివిజన్ నందు అనేక సమస్యలతో ఇబంది పడుతున్నామని అనేక సార్లు మున్సిపల్ కమిషన్ కు పిర్యాదు ఇచ్చిన కూడా పట్టించుకున్న దాకకలాలు లేవని. ప్రజల సమస్యలపై ఏ అధికారి కుడా చొరవ చూపదంలేదని వినతిలో పేర్కొన్నారు ఏడవ డివిజన్ లో పలు సమస్యల గురించి డ్రైనేజ్. విద్యుత్ స్తంభాలు. వీధి దీపాలు. రోజు చెత్త వాహనం రావడం లేదని, కొత్త సిసి రోడ్ల నిర్మాణం,స్కూల్ చుట్టూ ప్రహరీ గోడ, 24గంటలు ఏఎన్ఎం, ప్రాథమికచికిత్స కేంద్రంలో ఉండే విధంగా చర్య తీసుకోవాలని,వినతిపత్రంలో పేర్కొన్నారు.కలెక్టర్ సానుకూలంగా స్పందించి. సమస్యలపరిస్కారం కోసం కృషిచేస్తానని హామీ ఇచ్చారు ఈ కారిక్రమంలో,ఇండియన్ యూత్ కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనరల్ సెక్రటరీ భాషబోయిన అశోక్ కుమార్, దుర్గాప్రసాద్ (టైగర్). బాదావత్ లాకేష్. సోల్ల వినయ్. విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# త్రిస్సూర్ జిల్లాల్లో మంత్రి శ్రీధర్ బాబు సుడిగాలి ప్రచారం

**కేరళం, విశాలభారతి:**



శాసనసభ ఎన్నికలు జరుగుతున్న కేరళం లోని త్రిస్సూర్ జిల్లాలో సోమవారం నాడు తెలంగాణా ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహిచారు. త్రిస్సూర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జోసెఫ్ తాజెట్ తోకలిసి ఆయన రెండ్రోజులుగా ఒల్లూర్, నట్టిక, కైపమండలం, పుదుక్కాడ్, చలకుడి, కోడుంగల్లూర్, మనలూర్ తదితర అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. త్రిస్సూర్ జిల్లాలో 13 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుడిఎఫ్ కేవలం రెండు స్థానాలను మాత్రమే దక్కించుకుంది. ఈ సారి అధికార ఎల్డీఎఫ్ తీవ్ర స్థాయిలో ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్న నేపథ్యంలో త్రిస్సూర్ జిల్లాలో కాంగ్రెస్ మెజారిటీ సీట్లను దక్కించుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. పగలంతా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉంటున్న శ్రీధర్ బాబు రాత్రి వేళల్లో త్రిస్సూర్ కాంగ్రెస్ సీనియర్ నేతలతో పలుదఫాలు సమావేశాలు నిర్విహించారు. పార్టీ గెలుపునకు అందరూ ఐకమత్యంగా కలిసి పనిచేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సోమవారం నాడు మహారాష్ట్రలోని పశ్చిమ నాగపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే, నాగపూర్ డిసిసి అధ్యక్షుడైన వికాస్ ఠాక్రే శ్రీధర్ బాబు ను మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల ప్రచారం తీరుతెన్నులపై చర్చించారు.

# బోడుప్పల్ సీజన్ 3 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజయవంతం

**నిర్వాహకులు సురేష్ మద్దినేని .. ముఖ్యఅతిథిగా బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ ఏ శైలజ**



**బోడుప్పల్, విశాలభారతి:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ లో సురేష్ మద్దినేని ఆధ్వర్యంలో ఛాంపియన్స్ బోడుప్పల్ సీజన్ 3 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ ఏ శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం ఉత్సాహంతో పాటు శారీరకంగా. మానసికంగా దృఢంగా ఉండటానికి ఎంతో దోహదపడుతుందని. క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందించు కోవచ్చని అన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు రాష్ట్ర జాతీయ. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు సురేష్ మద్దినేని మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ విజయవంతం చేయడంలో ఉదారంగా మద్దతు అందించిన బోడుప్పల్ కాలనీ లక్ష్మీనారాయణ. మదర్స్ హాస్పిటల్ ప్రశాంతి స్పాన్సర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. టోర్నమెంట్ అంతట బలమైన ప్రత్యర్థులను ఓడించి. 40 పోటీ మ్యాచ్లో విజయం సాధించడం ద్వారా అసాధారణ ప్రతిభను పట్టుదలను ప్రదర్శించిన విజేతలు. జస్వంత్. మణిరూప్ కు రన్నర్స్ సూర్య మను కు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని మహమ్మద్ ఆవేజ్. రేవంత్ . బృందం మొత్తం అందించిన అద్భుతమైన సహకారంతో ఈ టోర్నమెంట్ ని ఒక చిరస్మరణీయమైన. ఘనవిజయంగా మలిచాము ఈ కార్యక్రమంలో పాల్గొని మద్దతు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# కళాశాలలో 99 రోజుల ప్రజా పాలన



**పాల్వంచ విశాలభారతి:** పాల్వంచలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కమిషనరేట్ ఆఫ్ కాలేజియట్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు "విద్యార్థుల విజయాలు మరియు సాధనల ప్రదర్శన" కార్యక్రమం ఘనంగా మరియు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. పద్మ ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ, విద్యార్థులు విద్య, క్రీడలు, సాంస్కృతిక మరియు ఇతర సహపాఠ్య రంగాల్లో సాధించిన విజయాలు వారి కృషి, పట్టుదల మరియు ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో మరియు ఇతరులకు ప్రేరణగా నిలవడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. కళాశాలలోని అన్ని విభాగాల విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ తమ విభాగాల్లో సాధించిన అచీవ్మెంట్స్‌ను ప్రదర్శించారు. ముఖ్యంగా వారు గెలుచుకున్న మెడల్స్, సర్టిఫికెట్స్, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు మరియు ఇతర గౌరవాలను అందంగా అలంకరించి ప్రదర్శించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి విభాగం తమ విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించేలా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి సందర్శకులను ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో విద్యార్థుల విద్యా ప్రతిభతో పాటు క్రీడా, సాంస్కృతిక మరియు సామాజిక సేవా రంగాల్లో సాధించిన విజయాలు స్పష్టంగా ప్రతిఫలించాయి. ఒక విభాగం మాత్రమే కాకుండా అన్ని విభాగాల్లోనూ సమానంగా విద్యార్థుల విజయాలు ప్రదర్శించబడడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. ఈ కార్యక్రమం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలిచి, వారిలో పోటీ భావనను పెంపొందించడంతో పాటు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలనే సంకల్పాన్ని కలిగించింది. అధ్యాపకులు విద్యార్థుల సాధనలను అభినందిస్తూ, భవిష్యత్తులో ఇంకా గొప్ప విజయాలు సాధించాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె మాధవి డాక్టర్ టి అరుణకుమారి డి రమేష్ విజయ ప్రసాద్ డాక్టర్ కామేశ్వరరావు డాక్టర్ శెట్టి స్వరూపారాణి పొట్ల పువ్వు శ్రీనివాసరావు పారెల్లి శ్రీనివాస్ కోటగిరి రాంబాబు డాక్టర్ నియాజ్ పర్వీన్ డాక్టర్ ఎన్ శ్రీదేవి బాబ్జి ఖాన్ లీలా సౌమ్య డాక్టర్ రమేష్ డాక్టర్ పవన్ బి రమేష్ కరీమా వకుల హారిక తేజస్విని విమల రాజ్కుమార్ ధర్మారావు ఈ శ్రీను విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## బాసర ఆలయంలో ముఖ్యమంత్రి
# దంపతుల ప్రత్యేక పూజలు

**విశాల భారతి, బాసర :**

పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ క్షేత్రానికి నిర్మల్ జిల్లా బాసరలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం పర్యటించగా, వీరికి జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల కలెక్టర్ అభిలాష అభినవ్ ఆలయ క్షేత్రంలోని రాజన్న అతిథి గృహంలో పోలీసు గౌరవ వందనం అందించగా నేరుగా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకోగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభమేళంతో ఘన స్వాగతం పలికి నేరుగా ప్రత్యేక అక్షరధాస మండపంలో ముఖ్యమంత్రి మనవడు శ్రేయాన్స్ కు అక్షర శ్రీకారాలు దిద్దారు, అనంతరం అమ్మవారి గర్భగుడిలో ముఖ్యమంత్రి దంపతులు అమ్మవార్లకు నూతన వస్త్రాలతో పాటు పండ్లు పదార్థాలు అందించగా వీరికి ఆలయ అధికారులు వేదమంత్రాలు మధ్య మహా మంగళహారతినిచ్చి నేరుగా మహంకాళి అమ్మవారిని దర్శించుకోగా ఆశీర్వచనం ప్రదేశంలో వేద పండితులు ఆలయ కార్య నిర్వహణ అధికారి విజయ రామారావు తోపాటు దేవదాయ శాఖ కమిషనర్ హనుమంతు రోజా రామయ్యర్, అమ్మవారి మెమొంటో అందించారు. నిండు నూరేళ్లు సుఖశాంతులతో ఉండి మా ఆలయ ప్రాంగణం నూతన పునర్నిర్మాణ పనులు జరుపుతున్న నేపథ్యంలో మీ కుటుంబ సభ్యులకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుతూ ఆశీర్వచనం అందించారు. వీరి వెంట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తోపాటు దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, మంత్రి సుదర్శన్ గౌడ్, మాజీ మంత్రి, వేణుగోపాల చారి ఎంపి నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులు ఉమ్మడి జిల్లా అదిలాబాద్ ఎంపీ నాగేష్ ఎమ్మెల్యే ముధోల్ రామారావు పటేల్, నిర్మల్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్, ప్రదేష్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ప్రజా ప్రతినిధులు ఆయా షాప్ కు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. అనంతరం నేరుగా 200, 25 కోట్ల నిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులకు అంకురార్పణ చేయగా ముఖ్యమంత్రి కి గడ్డపార సిమెంట్తో అంతకుముందు టెంకాయ కొట్టి ప్రత్యేక పూజలు చేయగా వేద పండితుల వేదమంత్రాలు మధ్య పనులను పూనుకున్నారు. దీనితో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలయానికి రాకముందు ఒకరోజు ముందే జిల్లా ఎస్పీ డాక్టర్ జానికి షర్మిల 500 మంది పోలీసు ఎస్సై ఎస్సై సీఐ కమాండర్ సిబ్బందితో కలిసి వహారా కాస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాన్ని చేపట్టారు .

# కురవి సంతలో వసూళ్ల దందా..!

**నిబంధనలకు పాతర వేస్తున్న గుత్తేదారులు**

**కురవి, విశాల భారతి:**

మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి సోమవారం జరిగే వారాంతపు సంత అక్రమ వసూళ్లకు అడ్డాగా మారింది. ఏడాది పొడవునా సాగే ఈ వ్యాపారంలో గుత్తేదారులు నిబంధనలను గాలికొదిలేసి, అమాయక రైతుల నుండి అదనపు వసూళ్లు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో గొర్రెలు, మేకలు, పశువుల విక్రయాల వద్ద అడ్డగోలు దోపిడీ సాగుతోంది.

**నిబంధనలు గాలికి.., అదనపు వసూళ్లు జేబులోకి!**

పంచాయతీ నిబంధనల ప్రకారం పశువుకు రూ. 300, మేకలు లేదా గొర్రెలకు రూ. 200 చొప్పున రహదారి రుసుము వసూలు చేయాలి. కానీ, మార్చి మొదటి సోమవారం నుంచి ప్రారంభమైన కొత్త టెండర్ కాలంలో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పశువులకు రూ. 400, మేకలకు రూ. 300 వసూలు చేస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. నిబంధనల కంటే రూ. 100 అదనంగా వసూలు చేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.

**నకిలీ రసీదుల మాయాజాలం..**
**లెక్కల్లో గందరగోళం**

అధికారులు జారీ చేసిన అధికారిక రసీదు పుస్తకాలను వాడకుండా, నిర్వాహకులు సొంతంగా ముద్రించుకున్న రసీదులను వాడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రసీదులపై కేవలం కొనుగోలుదారులు, అమ్మే వారి పేర్లు మాత్రమే రాస్తున్నారు. వసూలు చేసిన అసలు మొత్తాన్ని రసీదులో నమోదు చేయకుండా కేవలం పశువు వెల మాత్రమే వేస్తూ.., అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు.

**పట్టించుకోని పంచాయతీ తీర్మానం..,**
**ప్రచారమేది?**

వసూళ్ల ధరల పట్టికను సంతలో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని, మైకుల ద్వారా ధరల వివరాలను ప్రచారం చేయాలని గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అయితే, ఆ తీర్మానాలు కాగితాలకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో ధరల పట్టిక ఏర్పాటు చేయకపోగా, సిబ్బంది ద్వారా ఎలాంటి ప్రచారం నిర్వహించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే గుత్తేదారులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



**విచారణ జరిపి చర్యలు**
**తీసుకోవాలని రైతుల డిమాండ్.**

మొదటి సంత నుంచే అక్రమాలకు తెరలేపిన గుత్తేదారులపై ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు. వెంటనే విచారణ జరిపి, అక్రమంగా వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం నిర్ణీత ధరలకే రసీదులు ఇచ్చేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

**కురవి తై బజార్‌లో అక్రమ దందా..?**

కురవి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే తై బజార్ అక్రమ వసూళ్లకు అడ్డాగా మారింది. టెండర్ దక్కించుకున్న గుత్తేదారులు నిబంధనలను తుంగలో తొక్కి సామాన్య వ్యాపారుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

**రసీదులు లేవు.. లెక్కలు అసలే లేవు!**

నియమ నిబంధనల ప్రకారం వ్యాపారులకు నిర్ణీత రుసుము తీసుకుని రసీదులు అందజేయాలి. కానీ, కురవి సంతలో గుత్తేదారులు ఎలాంటి రసీదులు ఇవ్వకుండానే వసూళ్లు సాగిస్తున్నారు. అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, ఇతర చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే పేదల నుంచి సైతం అధిక మొత్తంలో డబ్బులు గుంజుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



**అధికారుల పర్యవేక్షణ కరువు**

పంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ అక్రమ వసూళ్లపై స్థానిక అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, తై బజార్‌లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని, రసీదుల ద్వారానే వసూళ్లు జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. కురవి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే పశువుల సంతను ఆసరాగా చేసుకుని, పశువులను అక్రమంగా కబేళాలకు తరలిస్తే ఊరుకునేది లేదని బీజేపీ కురవి మండల అధ్యక్షులు భూక్య కిషన్ నాయక్ హెచ్చరించారు. సోమవారం కురవిలో "విశాల భారతి" ప్రతినిధితో ఆయన మాట్లాడారు. అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి. వ్యవసాయ అవసరాల కోసం పశువులను కొనుగోలు చేసే రైతులకు ఈ సంత వేదిక కావాలని, కానీ కొందరు అక్రమార్కులు పశువులను కబేళాలకు తరలిస్తూ లాభపడుతున్నారని ఆయన ఆరోపించారు. రవాణా నిబంధనలకు విరుద్ధంగా, మూగజీవాలను హింసిస్తూ వాహనాల్లో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల అక్రమ రవాణాపై పోలీసులు, సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కిషన్ నాయక్ హెచ్చరించారు.


అమ్మినవారి సంతకం. కాంట్రాక్టర్ సంతకం.
గమనిక:- సంతలో అమ్మబడిన పశువులు, మేకలు దొంగిలించబడినచో క్రయ విక్రయము కొన్నవారిదే బాధ్యత యుండును.



## మా అంగీకారం తీసుకోవాల్సిందే!

ఎప్పుడూ ఏదో ఒక వ్యవహారంతో వార్తల్లో ఉండే తారాల్లో జాన్వీకపూర్ ఒకరు. నిజానికి సినిమాల కంటే సోషల్ మీడియా ద్వారానే ఎక్కువ వార్తల్లో నిలుస్తుంటుంది జాన్వీకపూర్. రీసెంట్‌గా ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్ల ప్రవర్తనపై ఈ అందాలభామ ఇరిటేట్ అయ్యింది. తను ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నదో కూడా చూడకుండా, ఎక్కడబడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు ఫొటోలు తీసి, వాటిని సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేయడంపై జాన్వీకపూర్ బాహాటంగానే భగ్గుమంది. 'అందంగా ఫొటోలు తీయడం ఓ కళ. అలాగే ఫొటోలకు ఫోజులివ్వడం కూడా కళే. అయితే దీనికి వేళాపాళా అవసరం. మేం సిద్ధంగా లేనప్పుడు, ఎలా పడితే అలా ఫొటోలు తీసి, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం వల్ల.. నెటిజన్ల నుంచి విమర్శలు మేం ఎదుర్కోవలసి వస్తున్నది. 'హాట్‌గా లేదు.. అందంగా లేదు..' అంటూ వాళ్లు కామెంట్లు పెడుతుంటే, ఒక నటిగా నాకెంత బాధగా ఉంటుందో ఆలోచించారా?. జిమ్‌కెళ్లినా, ఎయిర్‌పోర్ట్‌కెళ్లినా, ఏ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైనా ఈ పాపరాజీలు(ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్లు) మాత్రం మమ్మల్ని వదలడం లేదు. దయచేసి వారందరికీ నేను మనవి చేసేదొక్కటే. మా ఫొటోలు తీయండి. కానీ మా అంగీకారంతో తీయండి. మేం సిద్ధంగా లేనప్పుడు ఫొటోలు తీసి, మా అందానికి చెడ్డ పేరు తేవొద్దు.. ప్లీజ్' అంటూ చెప్పకొచ్చింది జాన్వీ.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.